News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS చంద్రకాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 03 | సంచిక :145 | ఖమ్మం | గురువారం, జూలై 10, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## కృష్ణా జలాల్లో కేసీఆర్ ద్రోహం
# వెయ్యి రెట్లు అధికం

- ఉమ్మడి పాలనలో కన్నా ఆయన హయాంలోనే తీవ్ర అన్యాయం
- జగన్‌తో భారత రాష్ట్ర సమితి అధినేత అనుబంధం.. రాష్ట్రానికి తీరని నష్టం
- పదేళ్లలో ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు
- తేదీ చెబితే చర్చకు అసెంబ్లీ సమావేశాలు పెడతాం
- ఎర్రవల్లి ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీకైనా సిద్ధం.. నేనూ వస్తా
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కృష్ణా జలాల్లో కేసీఆర్ తెలంగాణకు తీరని ద్రోహం చేసి మరణశాసనం రాశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఉమ్మడి రాష్ట్ర పాలకులు చేసిన అన్యాయం కంటే.. ఇది వెయ్యి రెట్లు ఎక్కువన్నారు. వైఎస్ జగన్‌తో కేసీఆర్‌కు ఉన్న అనుబంధం రాష్ట్రానికి తీరని నష్టం చేసిందని ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి పాలనలో జరిగిన తప్పుల్ని తమ ప్రభుత్వం సరిదిద్దుతోంటే ప్రధాన ప్రతిపక్షం ఎదురుదాడి చేస్తోందని ఆక్షేపించారు. గోదావరి, కృష్ణా జలాలపై చర్చించేందుకు సిద్ధమని... కేసీఆర్ ఏ తేదీ చెబితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు పెడదామని సవాల్ విసిరారు. లేదంటే ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో మాక్ అసెంబ్లీ పెట్టడానికైనా తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. కేసీఆర్ కోరితే తాను కూడా ఫాంహౌస్‌కు వెళ్తానని స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో బుధవారం నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

పబ్బులు, క్లబ్బులకు నేను వ్యతిరేకం

"కాళేశ్వరంపై వాస్తవాల నివేదికను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు. వాస్తవ పరిస్థితులను కేంద్రం ఎదుట ఉంచాం. భారత రాష్ట్ర సమితిను బతికించుకోవడానికి కేసీఆర్ నానా పాట్లు పడుతున్నారు. నీళ్ల సెంటిమెంట్‌ను రేపుతున్నారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో చర్చిద్దామని కేసీఆర్‌కు సూచించా... సవాల్ చేయలేదు.

వివరాలు 2లో..



# కల్తీ కల్లోలం
## హైదరాబాద్‌లో ఐదుగురి మృతి

- నిమ్స్‌లో 31 మందికి చికిత్స
- పెరుగుతున్న బాధితుల సంఖ్య
- పోలీసుల అదుపులో ఏడుగురు నిందితులు



రాజధాని హైదరాబాద్‌లో కల్తీ కల్లు మహమ్మారి తీవ్ర విషాదం మిగిల్చింది. అస్వస్థతకు గురైన వారిలో ఐదుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో ఒకరు రెండ్రోజుల క్రితమే మృతి చెందగా బుధవారం వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ... మంగళవారం మరొకరు, బుధవారం ముగ్గురు కన్నుమూశారు. వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులందర్నీ నిమ్స్‌కు తరలిస్తున్నారు. మంగళవారం రాత్రి బాధితుల సంఖ్య 15 ఉండగా... బుధవారం సాయంత్రానికి 31కి పెరిగింది. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనతో బాలానగర్ ఆబ్కారీ ఠాణాలో ఐదు కేసులు, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. ఏడుగుర్ని అదుపులోకి తీసుకున్నారు. బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో..

వివరాలు 2లో..




## అవసరం మేరకు యూరియా సరఫరా
### కేంద్ర మంత్రి జేపీ నడ్డా



: తెలంగాణలో యూరియా అధికంగా వినియోగిస్తున్నట్లు కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. 2023-24 రబీతో పోలిస్తే 2024-25లో 21%, 2024 ఖరీఫ్‌తో పోలిస్తే 2025 ఖరీఫ్‌లో 12.4% అధికంగా ఉపయోగించినట్లు వెల్లడించారు.

వివరాలు 2లో..

## రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాక ఏం చేస్తానంటే?



- రాజకీయాల నుంచి వైదొలిగాక తన ప్రణాళిక చెప్పిన అమిత్ షా
- వేదాలు, ఉపనిషత్తులు చదువుతానన్న కేంద్ర మంత్రి
- ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెడతానని వెల్లడి
- రసాయన ఎరువులతో ఆరోగ్య సమస్యలని హెచ్చరిక
- హెూం శాఖ కన్నా సహకార శాఖే తనకు పెద్దదని వ్యాఖ్య

వివరాలు 2లో..

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

- ఐపీఎల్ టికెట్ల వివాదంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు అరెస్ట్
- జగన్మోహనరావుతో పాటు మరొకరిని అదుపులోకి తీసుకున్న సీఐడీ
- గత సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలెత్తిన గొడవ
- విజిలెన్స్ నివేదిక ఆధారంగా సీఐడీ చర్యలు
- ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చినట్లు నిర్ధారణ
- కార్పొరేట్ బాక్స్‌కు తాళం వేయడంతో ముదిరిన వివాదం



హైదరాబాద్ క్రికెట్ అసోసి యేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్మోహ నరావును సీఐడీ అధికారులు బుధవారం అరెస్ట్ చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫ్రాంచైజీతో టికెట్ల విషయంలో తలెత్తిన వివాదమే ఈ అరెస్టుకు దారితీసింది. ఆయనతో పాటు మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు.గత ఐపీఎల్ సీజన్ సందర్భంగా హెచ్‌సీఏ, ఎస్ఆంర్‌హెచ్ యాజమా న్యం మధ్య టికెట్ల కేటాయింపుపై తీవ్ర విభేదాలు తలెత్తాయి. తమకు టికెట్లు కేటాయించలేదనే కారణంతో హెచ్‌సీఏ అధికారులు సన్‌రైజర్స్‌కు చెందిన కార్పొరేట్ బాక్స్‌కు తాళం వేయడం వివాదాస్పదమైంది. హెచ్‌సీఏ వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం

వివరాలు 2లో..

# గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
## కృష్ణా జలాలపై మంత్రి ఉత్తమ్ సంచలన వ్యాఖ్యలు

- ఏపీకి మేలు చేసేలా కేసీఆర్ సర్కార్ వ్యవహరించిందన్న ఉత్తమ్
- రాయలసీమ లిఫ్ట్ టెండర్లకు పరోక్షంగా సహకరించారని విమర్శ
- పదేళ్లలో కీలక ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని వ్యాఖ్య



గత పదేళ్ల పాలనలో కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇది ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేసేందుకు జరిగిన కుట్ర అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వం కీలక ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్లే రాష్ట్రం తన హక్కులను కోల్పోయిందని ఆయన విమర్శించారు. బుధవారం ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,

వివరాలు 2లో..

### ముగ్గురు మూర్ఖులు జగన్ ను
# ఆపగలరా?




- కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేత పేర్ని నాని తీవ్ర ఆగ్రహం
- జగన్ చిత్తూరు పర్యటనను అడ్డుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు
- రైతుల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదని తీవ్ర విమర్శ

వివరాలు 2లో..

## ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలకు అనుగుణంగా హ్యామ్ రోడ్లు



ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనలకు అనుగుణంగా హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్లను నిర్మిస్తామని రాష్ట్ర రోడ్లు- భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలకు అనుసంధానం చేయడంలో హ్యామ్ రోడ్లు కీలకం కానున్నాయని తెలిపారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో బుధవారం రోడ్లు- భవనాలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. 'టెండర్ల ప్రక్రియను అధికారులు వెంటనే ప్రారంభించాలి. ప్రాధాన్య క్రమంలో హ్యామ్ రోడ్లను నిర్మిస్తాం. వంతెనలను ముందే గుర్తించి రోడ్ల నిర్మాణ సమయంలో ప్రమాదాలు జరగకుండా చూడాలి. రాష్ట్రంలో 50 శాతం రోడ్లు హ్యామ్ పద్ధతిలో అభివృద్ధి చేస్తాం.

వివరాలు 2లో..

## పక్కా ప్రణాళికతోనే జగన్ పర్యటనలు చేస్తున్నారు



- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నిస్తున్నారన్న అచ్చెన్నాయుడు
- ఐదారు జిల్లాల నుంచి జనాలను తరలించడం ఎందుకని ప్రశ్న
- పథకం ప్రకారమే రోడ్లపై మామాడి పండ్లు పోశారని విమర్శ

వైసీపీ అధినేత జగన్ చేపడుతున్న పర్యటనలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన జగన్‌కు లేదని, కేవలం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే పక్కా ప్రణాళికతో యాత్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు.జగన్ పర్యటనలు సినిమా సెట్టింగుల్లా ఉన్నాయని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. "పరామర్శకు వెళ్తే రైతులను కలిసి మాట్లాడాలి కానీ, ఐదారు జిల్లాల నుంచి జనాన్ని తరలించడం ఎందుకు? ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే రోడ్లపై మామిడి పండ్లను పోశారు. ఇది క్రిమినల్ మైండ్‌తో చేసే పని" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి చర్యలతో సమాజానికి

# కల్తీ కల్లోలం

- మొదటి పేజి తరువాయి

బాలానగర్ జోన్ పోలీసులు, మేడ్చల్ జిల్లా వైద్యాధికారిణి ఉమ, ఆబ్కారీ అధికారులు సమన్వయం చేసుకుంటున్నారు హైదరాబాద్‌లోని హైదర్‌నగర్, శంషిగూడ, నిజాంపేట, నడిగడ్డతండా, ఇందిరాహిల్స్, అడ్డగుట్ట తదితర ప్రాంతాలకు చెందిన రోజువారీ కూలీలు... ఈ నెల 5, 6 తేదీల్లో హైదర్‌నగర్, ఇంద్రానగర్, భాగ్యనగర్ తదితర ప్రాంతాల్లోని కల్లు దుకాణాల్లో కల్లు తాగారు. వారిలో చాలామంది 5-6 గంటల తర్వాత వాంతులు, విరేచనాలు, పొత్తికడుపులో నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధితుల్లో ఎక్కువ మంది తరచూ కల్లు తాగేవారే కావడంతో వారి కుటుంబ సభ్యులు సాధారణ కడుపునొప్పిగానే భావించారు. అయితే, కొందరికి మూత్ర విసర్జన చేయడమూ కష్టమవడం, స్పృహతప్పి పడిపోవడంతో వారిని స్థానిక ఆసుపత్రులకు కూకట్‌పల్లి హెచ్ఎంటీ హిల్స్ సాయిచరణ్‌కాలనీలో నివాసముండే వాచ్‌మెన్ చాకలి బొజ్జయ్య(55) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు.

హైదర్‌నగర్‌కు చెందిన చౌదరిమెట్టు స్వరూప(61) మంగళవారం సాయంత్రం మరణించింది. మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తుండగా... కల్తీకల్లు కారణంగా చనిపోయినట్లు బంధువులు అనుమానించడంతో ఆమె కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని గాంధీకి తీసుకొచ్చి శవపరీక్ష చేశారు.

కేపీహెచ్‌బీ శ్రీరామ్‌నగర్‌కు చెందిన సెక్యూరిటీ గార్డు, కలగళ్ల సీతారాం(74) మంగళవారం గాంధీ ఆసుపత్రిలో చనిపోయారు.

కూకట్‌పల్లి ఎల్లమ్మబండ పరిధిలోని మహంకాళినగర్‌కు చెందిన మౌనిక(25)కు ఆరేళ్ల క్రితం సర్దార్‌తో వివాహమైంది. భర్తతో విడిపోయి ప్రస్తుతం కుమారుడి(3)తో ఉంటున్నారు. భాగ్యనగర్‌కాలనీ కల్లు దుకాణంలో ఆదివారం సాయంత్రం కల్లు తాగింది. అస్వస్థతతో మూడు రోజులుగా ఇంట్లోనే ఉంటున్న మౌనిక పరిస్థితి బుధవారం సాయంత్రం విషమించడంతో కూకట్‌పల్లి రాందేవరావు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు.

మెదక్ జిల్లా శంకరంపేట మండలం ఉత్తులూరుకు చెందిన మెట్ల నారాయణ(40) వంటమాస్టర్‌గా పనిచేస్తూ కేపీహెచ్‌బీలోని హెచ్ఎంటీ హిల్స్ రామాలయం సమీపంలో ఉంటున్నారు. సోమవారం ఉదయం స్థానిక దుకాణంలో కల్లు తాగిన తర్వాత శంకరంపేటలోని సోదరి వద్దకు వెళ్లారు. ఆయనకు అదేరోజు సాయంత్రం వాంతులు, విరేచనాలయ్యాయి. మాత్రలు వాడినా తగ్గకపోవడంతో బుధవారం మధ్యాహ్నం కేపీహెచ్‌బీలోని ఇంటికి తీసుకొచ్చారు. రాత్రి ఏడు గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు రాందేవ్‌రావు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మృతదేహాన్ని శవపరీక్ష కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**ఆ తెల్లని పదార్థం ఏమిటి...?**

బాధితుల మరణాలకు కల్లులో ఆల్ప్రాజోలం, ఇతర రసాయనాల మోతాదు పెరగడమే కారణమని ఆబ్కారీ అధికారులు భావిస్తున్నారు. ఇంద్రానగర్‌లోని కల్లు దుకాణంలో తనిఖీలకు వెళ్లినప్పుడు 66 గ్రాముల తెలుపు రంగు పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదేమిటో ఇంకా తేలలేదు.

**ఐదు కేసులు.. ఏడుగురు అదుపులోకి...**

ఆబ్కారీ అధికారులు ఐదు కేసులు నమోదు చేసి, ముగ్గురు కల్లు దుకాణాల నిర్వాహకులు, నలుగురు కల్లు విక్రేతలను అదుపులోకి తీసుకున్నారు. హైదర్‌నగర్, ఇంద్రానగర్‌లలోని దుకాణాలను కూన రవితేజగౌడ్ నిర్వహిస్తుండగా... భాగ్యనగర్ దుకాణాన్ని జె.ప్రభాకర్‌గౌడ్, ఎస్పీనగర్ దుకాణాన్ని కూన సాయితేజగౌడ్ నిర్వహిస్తున్నట్లు తేలింది. వీరితోపాటు తీగల రమేశ్, టి.శ్రీనివాస్‌గౌడ్, చింతకింది నగేశ్‌గౌడ్, బట్టి శ్రీనివాస్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మొత్తం నాలుగు దుకాణాల నుంచి 350 మిల్లీలీటర్ల చొప్పున కల్లు నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. 674 లీటర్ల కల్లును ధ్వంసం చేశారు. సాయితేజగౌడ్, రవితేజగౌడ్ ఇద్దరూ శేరిలింగంపల్లి కాంగ్రెస్ నేత కూన సత్యంగౌడ్ కుమారులు.

మృతులు స్వరూప, సీతారాం, నారాయణ కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేపీహెచ్‌బీ ఠాణాలో మూడు కేసులు నమోదయ్యాయి. నిందితుల జాబితాలో ఇంకా ఎవర్నీ చేర్చలేదు.

**బాధ్యులపై క్రిమినల్ కేసులు పెడతాం: మంత్రి జూపల్లి**

కల్తీ కల్లు ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టంచేశారు. బుధవారం ఆయన నిమ్స్‌లో బాధితులను పరామర్శించారు. నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్పను అడిగి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ... "ఈ ఘటనకు కల్తీ కల్లు కారణమని భావిస్తున్నా. ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకున్నాం. సమగ్ర విచారణ తర్వాత బాధ్యులపై క్రిమినల్ కేసుల నమోదుతోపాటు లైసెన్సులు రద్దు చేస్తాం" అని స్పష్టంచేశారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి: ఎంపీ ఈటల

కల్తీకల్లు బాధితులను నిమ్స్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... "మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి. ప్రభుత్వమే వైద్య ఖర్చులను భరించాలి. కొందరి కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు చెప్పారు" అని వెల్లడించారు.

**అనుమతులు ఆపినా ఆగని కల్లు విక్రయాలు**

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కల్లు విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ కళ్లు మూసుకుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కల్తీ చేసినందుకు లైసెన్సులను రద్దు చేసిన దుకాణాల్లోనూ విక్రయాలు యథావిధిగా కొనసాగుతున్నా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా కూకట్‌పల్లి ప్రాంతంలో కల్తీకల్లు తాగి ఐదుగురు మృతి చెందడం, పదుల సంఖ్యలో అస్వస్థతకు గురవడంతో విషయం చర్చనీయాంశమైంది.

హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు కల్లు దుకాణాల్లో కల్తీ జరుగుతోందనే అంశం కొంతకాలం క్రితం వెలుగుచూసింది. గతేడాది హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సందీప్‌శాండిల్య ఉన్నప్పుడు నగరంలోని 70 దుకాణాల్లోని కల్లు నమూనాలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించగా 58 దుకాణాల్లోని కల్లులో అల్ప్రాజోలం ఉన్నట్లు వెల్లడైంది. ఆయా దుకాణాల లైసెన్సులను అప్పటి ఎక్సైజ్ కమిషనర్ సస్పెండ్ చేశారు. దీనిపై కల్లు దుకాణాల నిర్వాహకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా... అప్పిలేట్ అథారిటీ అయిన హైదరాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు అప్పీలు చేసుకోవాలని సూచించింది. దుకాణాల నిర్వాహకులు అప్పీలు చేసుకోగా... డిప్యూటీ కమిషనర్ దాన్ని తిరస్కరించారు. కొందరు నిర్వాహకులు మరోసారి కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. వీరి సంఖ్య తక్కువగానే ఉంది. అయినా అన్ని దుకాణాల్లో యథావిధిగా కల్లు విక్రయాలు జరుగుతున్నా యంత్రాంగం కళ్లు మూసుకుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రమాదకరమైన క్లోరల్‌హైడ్రేట్ ఆనవాళ్లు...**

కొన్ని కల్లు దుకాణాల్లో... అల్ప్రాజోలం కంటే ప్రమాదకరమైన క్లోరల్ హైడ్రేట్ కలుపుతున్నట్లు బహిర్గతమైంది. చిక్కడపల్లి, అడిక్‌మెట్ ప్రాంతాల్లోని రెండు దుకాణాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం జరిపిన దాడుల్లో ఇది వెల్లడైంది. ఇవి ప్రముఖ మద్యం వ్యాపారి నిర్వహణలో ఉన్నట్లు తేలింది. సాధారణంగా కల్లులో క్లోరల్‌హైడ్రేట్ ఆనవాళ్లు కనిపిస్తే ఎక్సైజ్ యంత్రాంగం సీరియస్‌గా పరిగణిస్తుంది. ఈ ఘటనలో మాత్రం మద్యం వ్యాపారిపై పెద్దగా చర్యలేమీ తీసుకోకపోవడం గమనార్హం. నెల రోజుల క్రితం ఈ ఘటనలు జరగ్గా.. మరుసటి రోజు నుంచే ఆయా దుకాణాల్లో యథావిధిగా కల్లు విక్రయాలు మొదలవడం విస్తుపోయే అంశంగా మారింది.

# కృష్ణా జలాల్లో కేసీఆర్ ద్రోహం వెయ్యి రెట్లు అధికం

- మొదటి పేజి తరువాయి

నీళ్లు, నిధుల శాఖలను కేసీఆర్ కుటుంబమే పదేళ్లు నిర్వహించింది. సాగునీటిశాఖకు కేసీఆర్, హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహించారు. ఒకాయన ప్రెస్‌క్లబ్‌కి వెళ్లి చర్చకు రమ్మంటూ సవాల్ చేశారు. ఆయన పేరు చెప్పడం నా స్థాయికి తగదు. నన్ను పబ్బులకు, క్లబ్బులకు పిలవద్దు. వీటికి వ్యక్తిగతంగా నేను వ్యతిరేకం.

**కేసీఆర్ నిర్ణయాలతో తీరని నష్టం**

కేసీఆర్ తప్పులు చేసి మాపై నెపం మోపుతున్నారు. ఆయన తీసుకున్న నిర్ణయాలు కృష్ణా పరీవాహక ప్రాంత రైతులకు తీరని నష్టం కలిగించాయి. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు తీరని నష్టం వాటిల్లింది. కృష్ణా ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే... మనం వదిలితేనే ఆంధ్రప్రదేశ్‌కు జలాలు వెళ్లేవి. కేసీఆర్ తీరుతోనే కృష్ణా జలాల్లో ఏపీ దోపిడీ చేస్తోంది. ఈ విషయం అడుగుదామంటే.. ఆయన అసెంబ్లీకి రావడం లేదు. ఇది ప్రజాభవన్... కోట కాదు... ఎవరైనా ధర్మగంట కొడితే ప్రభుత్వం స్పందిస్తుంది... పరిష్కరిస్తుంది. భారత రాష్ట్ర సమితి హయాంలో ధర్మగంట తొలగించారు. ధర్నాచౌక్ తొలగించారు. ప్రజాభవన్‌లో సమావేశం అంటే.. హరీశ్‌కు అభ్యంతరమెందుకు? మంత్రి శ్రీధర్‌బాబుకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారు.

ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ తిలకిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మహేశ్‌కుమార్‌గౌడ్, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్

బేసిన్లు, భేషజాలు లేవంటూ అన్యాయం

కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలంటూ కేసీఆర్ సంతకం చేశారు. గోదావరిలో 3,000 టీఎంసీల నీళ్లు సముద్రంలో పోతున్నాయన్నారు. బేసిన్లు లేవు, భేషజాలు లేవంటూ... గోదావరి నుంచి కృష్ణా బేసిన్, అక్కడి నుంచి పెన్నా బేసిన్‌లోని ప్రకాశం, నెల్లూరు తరలించుకోవచ్చని చెప్పారు. రాయలసీమను రత్నాల సీమ చేస్తానని నాడు కేసీఆర్ అన్నారు. జగన్‌ను హైదరాబాద్‌కు పిలిచి సూచనలు, సలహాలివ్వడంతో పాటు జీఓలు, టెండర్లు ఇచ్చేలా సహకరించారు. వారిద్దరి అనుబంధం ఎలాంటిదైనా తెలంగాణకు తీరని నష్టం కలిగించింది. కృష్ణా నుంచి హైదరాబాద్‌కు తాగునీరు తెచ్చుకుంటున్నాం. హైదరాబాద్‌లో ఏపీవాసులు దాదాపు 20 శాతం మంది ఉన్నారు. ఉమ్మడి కోటా నుంచి హైదరాబాద్‌కు తాగునీటి జలాలు కేటాయించిన తర్వాత- మిగిలిన జలాల్ని పరీవాహక ప్రాంతం ప్రకారం పంపకాలు చేసి ఉంటే బాగుండేది. కానీ, కేసీఆర్ అలా ప్రయత్నించలేదు. కృష్ణా, తుంగభద్ర నదీ జలాలు... ముందు తెలంగాణలో అడుగుపెడతాయి. ఇక్కడ ఆ నీళ్లను ఒడిసిపడితే... తెలంగాణ వదిలేతేనే ఏపీకి వెళ్లేవి. రాయలసీమకు వెళ్లిన నీటిని దోపిడీ చేసే అవకాశాన్ని ఏపీకి కేసీఆర్ ఇచ్చారు. జూరాల నుంచి నీళ్లు తెలంగాణకు తెచ్చుకుని ఉంటే.. ఏపీ ప్రభుత్వం నీళ్లు కొల్లగొట్టడానికి అవకాశం ఉండేది కాదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు అంచనాలను భారత రాష్ట్ర సమితి హయాంలో బాగా పెంచేశారు. ఆ ప్రాజెక్టు నుంచి వచ్చే నీళ్లను తగ్గించారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి ఏపీ నాలుగు టీఎంసీలకు బదులు 10 టీఎంసీలకు పెంచుకుని నీళ్లను తీసుకెళ్తోంది. 2 టీఎంసీల నీటిని తీసుకెళ్లే పాలమూరు-రంగారెడ్డిని కేసీఆర్ ఒక టీఎంసీకి తగ్గించారు. కృష్ణా నదిపై ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ఫలితంగానే మన హక్కులు కోల్పోయాం. రూ.వెయ్యి కోట్లు ఖర్చుపెడితే పూర్తయ్యే.. 3.64 లక్షల ఎకరాలకు నీరిచ్చే ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పడావు పెట్టారు. జల విద్యుత్ ప్రాజెక్టులను నిర్వీర్యం చేశారు. గోదావరిని కృష్ణా, పెన్నా బేసిన్‌కు తరలించాలన్న కేసీఆర్.. రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు గోదావరి జలాలు రాకుండా చేశారు. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ దగ్గరకు వెళ్తే... 11 ప్రాజెక్టులకు కేంద్రం నిధులిస్తే తెలంగాణ ఖర్చు పెట్టలేదన్నారు. ఆదాయం రాదు కాబట్టే వాటిపై కేసీఆర్ దృష్టి పెట్టలేదు.

**అసెంబ్లీలో కూలంకషంగా చర్చిద్దాం**

ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన నిర్ణయాలపై.. తొమ్మిదిన్నరేళ్ల భారత రాష్ట్ర సమితి హయాంపై.. ఏడాదిన్నర కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలపై కూలంకషంగా చర్చిద్దాం. ప్రజలకు వివరిద్దాం. సభా నాయకుడిగా హామీ ఇస్తున్నా. ఎవరి గౌరవానికీ భంగం కలగనీయం. ఎలాంటి గందరగోళం లేకుండా సభను నిర్వహించే బాధ్యత నాది. అసెంబ్లీకి రావాలని కేసీఆర్‌కు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నా. నిపుణుల్ని పిలుద్దాం. రైతుల శాశ్వత హక్కుల్ని కాపాడుదాం. కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలని, ఆయన ప్రజాజీవితంలో ఉండాలని నేనంటుంటే.. మా నాయన రారని ఆయన కుమారుడు అంటున్నారు. వారి కుటుంబంలో సమస్యలుంటే మేమేం చేయాలి? అన్న, చెల్లె, బావ, బామ్మర్ది పంచాయితీ ఉంటే.. కుటుంబ, కులపెద్దలతో మాట్లాడి తేల్చుకోవాలి.

**కృష్ణా, గోదావరి జలాల్ని ఎవరికీ తాకట్టు పెట్టబోం**

తెలంగాణ హక్కులను కాపాడేందుకే కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది. భారత రాష్ట్ర సమితి ఇష్టానుసారం మాట్లాడటం సరికాదు. అవసరమైతే సూచనలు, సలహాలివ్వాలి. అహంకారంతో మాట్లాడేవారికి మా ఎమ్మెల్యే మందుల సామేలు చాలు. కృష్ణా, గోదావరి నదుల్లో తెలంగాణ హక్కులను ఎవరికీ తాకట్టు పెట్టబోం. ఇక్కడి ప్రజల హక్కులకు వ్యతిరేకంగా ఎవరు నిలబడినా.. చివరకు ఆ దేవుడు నిలబడినా కొట్లాడతాం. బనకచర్లపై పర్యావరణ మంత్రిత్వశాఖ వద్ద మా అభ్యంతరాలను లేవనెత్తడంతోనే ఏపీ ప్రభుత్వ దరఖాస్తును తిప్పిపంపించారు" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# ముగ్గురు మూర్ఖులు జగన్ ను ఆపగలరా?

వైసీపీ అధినేత జగన్ పర్యట నల ను అడ్డుకోవ డానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని, కానీ "ముగ్గురు మూరు?లు కలిసి జగన్‌ను ఆపగల రా?" అని మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అరచే తిని అడ్డుపెట్టి సూర్యరశ్మిని ఆపడం ఎవరివల్లా కాదని, అలాగే జగన్‌ను కూడా ఎవరూ నిలువరించలేరని ఆయన వ్యాఖ్యానించారు. జగన్ చిత్తూరు పర్యటన ఖరారవ్వగానే ప్రభుత్వం భయపడిపోయిందని పేర్ని నాని ఎద్దేవా చేశారు. "జగన్ వస్తున్నారని తెలిసి మార్కెట్ యార్డును మూసివేయించారు. పంట కొనే వ్యాపారులను, రైతులను రావొద్దని అడ్డుకున్నారు. ఇది ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనం" అని ఆయన అన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర కష్టాల్లో ఉంటే, వారి గోడు వినే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

"164 సీట్లు గెలిచామని జబ్బలు చరుచుకుంటున్న కూటమి నేతలు, ప్రజల సొమ్ముతో హెలికాప్టర్లలో తిరుగుతూ సోకులు చేసుకుంటున్నారు. కానీ ధాన్యం, పెసలు, మినుముల రైతులకు గిట్టుబాటు ధర దొరక్క ద అల్లాడుతుంటే పట్టించుకోవడం లేదు. ఇది రాష్ట్రానికి పట్టిన దరిద్రం" అని నాని విమర్శించారు. మామిడి రైతులను పరామర్శించేందుకు జగన్ వస్తానని చెప్పేంతవరకు ప్రభుత్వానికి స్పృహే లేదని అన్నారు. తాము 3.5 లక్షల టన్నుల మామిడి కొన్నామని, సబ్సిడీ ఇచ్చామని ప్రభుత్వం చెబుతున్న మాటలన్నీ అబద్ధాలని, ఒక్క రైతుకైనా లబ్ధి చేకూరినట్లు నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. మీకు నిజంగా చేతనైతే మామిడికి గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావు అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ నుంచి తమ ఫ్రాంచైజీని తరలిస్తామని హెచ్చరించింది. ఈ క్రమంలోనే హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహనరావుపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు, జగన్మోహనరావు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చినట్లు తమ నివేదికలో నిర్ధారించారు. ఆ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసిన సీఐడీ, తాజాగా జగన్మోహనరావును అరెస్ట్ చేసి విచారణ చేపట్టింది.

## రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాక ఏం చేస్తానంటే?

రాజకీయ జీవితం నుంచి విరమణ పొందిన తర్వాత తాను ఏమి చేయాలనుకుంటున్నారో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. తన భవిష్యత్ ప్రణాళికలను వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రజా జీవితానికి వీడ్కోలు పలికిన తర్వాత పూర్తి సమయం వేదాలు, ఉపనిషత్తుల అధ్యయనానికి కేటాయిస్తానని తెలిపారు. దీనితో పాటు ప్రకృతి వ్యవసాయంపై కూడా దృష్టి సారిస్తానని చెప్పారు. గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన సహకార సంఘాల మహిళలతో మాట్లాడుతూ ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రసాయన ఎరువులతో పండించే పంటల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని, అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి సేద్యం ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని, అదే సమయంలో వ్యవసాయ ఉత్పాదకతను కూడా పెంచవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా సహకార శాఖ మంత్రిగా తన బాధ్యతల గురించి కూడా అమిత్ షా మాట్లాడారు. తనకు హోం శాఖ అప్పగించినప్పుడు అందరూ అది కీలక శాఖ అన్నారని, కానీ సహకార శాఖ బాధ్యతలు స్వీకరించినప్పుడు హోం శాఖ కన్నా అదే పెద్ద శాఖ అని తాను భావించానని అన్నారు. దేశంలోని రైతులు, పేదలు, గ్రామాల సంక్షేమం కోసం ఈ శాఖ పనిచేస్తుండటమే దీనికి కారణమని ఆయన వివరించారు.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

- మొదటి పేజి తరువాయి

ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో నీటిపారుదల ప్రాజెక్టులపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. "ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ఎస్ఎల్‌బీసీ, కల్వకుర్తి, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను గత పదేళ్లలో పూర్తి చేసి ఉంటే, కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా దక్కేది. కానీ, గత ప్రభుత్వం వాటిని పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది" అని అన్నారు. అంతేకాకుండా, 2016లో కృష్ణా జలాల్లో ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలని అపెక్స్ కౌన్సిల్‌కు గత ప్రభుత్వం లిఖితపూర్వకంగా తెలిపిందని ఆయన గుర్తు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకుంటున్నా, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ చేపట్టినా గత ప్రభుత్వం అడ్డుకోలేకపోయిందని ఉత్తమ్ ఆరోపించారు. "రాయలసీమ లిఫ్ట్ టెండర్ల ప్రక్రియ పూర్తయ్యే వరకు అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని కుట్రపూరితంగా వాయిదా వేశారు. దీనివల్ల ఏపీకి మేలు జరిగింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే నాగార్జునసాగర్ ఆయకట్టు ఎడారిగా మారే ప్రమాదం ఉంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. 2019కి ముందే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే రాష్ట్రానికి ఎంతో మేలు జరిగేదని ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## అవసరం మేరకు యూరియా సరఫరా

- మొదటి పేజి తరువాయి

రాష్ట్రంలో యూరియా అధిక వినియోగం వల్ల భూమి సారంపై ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం ఆయన్ను కలిసి తెలంగాణకు యూరియా కోటా పెంచాలని కోరిన నేపథ్యంలో బుధవారం ఎరువులు, రసాయనాల శాఖ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. "తెలంగాణ రైతుల వాస్తవ డిమాండ్‌ను తీర్చడానికి అవసరమైన మద్దతు ఇస్తామని జేపీ నడ్డా హామీ ఇచ్చారు. అవసరాలకు తగ్గట్టుగా సరఫరా చేయాలని ఎరువులు, రసాయన శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో యూరియా అధిక వినియోగంపై ఆందోళన వ్యక్తం చేశారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, సమతౌల్యంగా ఎరువుల ఉపయోగాన్ని, ప్రత్యామ్నాయ ఎరువులు, సేంద్రియ, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించే రాష్ట్రాలకు చేయూతనందించడానికి కేంద్రం పీఎం ప్రణామ్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు శాఖ కార్యదర్శి రజత్‌కుమార్ మిశ్ర తెలిపారు. వ్యవసాయేతర అవసరాలకు ఎరువులను మళ్లిస్తున్న వారిపై చర్యలు తీసుకొని, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు సమానంగా ఎరువుల పంపిణీకి చర్యలు చేపట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు సూచించారు" అని ఆ శాఖ ప్రకటనలో పేర్కొంది.

## ఎన్‌హెచ్ఏఐ నిబంధనలకు అనుగుణంగా హ్యామ్ రోడ్లు

- మొదటి పేజి తరువాయి

ఆర్ఆర్ఆర్ ఉత్తరభాగం టెండర్ల ప్రారంభంతో పాటు దక్షిణభాగం ఆమోదం కోసం త్వరలోనే ప్రధాని మోదీ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలుస్తాం. ఎన్‌హెచ్-65 రహదారి పురోగతి పనుల్లో భాగంగా మదీనాగూడ నుంచి సంగారెడ్డి వరకు ఆరు వరుసల రహదారి పనులను వేగవంతం చేయాలి. చివరి దశల్లో ఉన్న టిమ్స్, కలెక్టరేట్లు, ఆర్వోబీ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఎన్‌హెచ్ఏఐ ఆర్వో కృష్ణ ప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఎన్సీ జయభారతి తదితరులు పాల్గొన్నారు.

**17 ప్యాకేజీలుగా హ్యామ్ రోడ్ల పనులు**

రాష్ట్రంలో అభివృద్ధి చేయనున్న హ్యామ్(హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రహదారుల పనులను 17 ప్యాకేజీలుగా విభజించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ప్యాకేజీల వారీగా టెండర్ల ప్రక్రియ, నిధుల కేటాయింపులపై గురువారం జరిగే మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. గతంలో రూపొందించిన హ్యామ్ జాబితాను మార్చి సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు కొత్త జాబితాను రూపొందించినట్లు సమాచారం. అధిక ట్రాఫిక్ ఉన్న రహదారులను కొత్త జాబితాలో పొందుపరిచారు. ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ఉన్న ఆర్అండ్‌బీ రహదారులకు ఈ జాబితాలో ప్రాధాన్యమిచ్చారు. ఫ్యూచర్ సిటీ, పారిశ్రామిక అభివృద్ధి దృష్ట్యా ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో ఎక్కువగా రహదారులను గుర్తించారు. జిల్లా కేంద్రాల నుంచి ప్రధాన పట్టణాలకు వెళ్లే రహదారులనూ కొత్త జాబితాలో చేర్చారు. దేవాలయాలు, పర్యాటక ప్రాంతాల రహదారులను మొదటి దశ హ్యామ్‌లో పొందుపరిచారు. హ్యామ్ పద్ధతిలో రోడ్లు-భవనాల శాఖకు చెందిన 373, పంచాయతీరాజ్ శాఖకు చెందిన 2,254 రహదారులను మొదటి దశలో అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం సుమారు రూ.22 వేల కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. టెండర్లు పొందిన గుత్తేదారుకు బ్యాంకు గ్యారంటీ, ప్రభుత్వ వాటా చెల్లింపులు, 15 ఏళ్లలో దశలవారీగా చెల్లించాల్సిన నిధులపైనా క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.ద

## పక్కా ప్రణాళికతోనే జగన్ పర్యటనలు చేస్తున్నారు

- మొదటి పేజి తరువాయి

ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు.

తోతాపురి మామిడి రైతుల సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈసారి 7 లక్షల మెట్రిక్ టన్నుల బంపర్ క్రాప్ రావడం, పల్ప్ పరిశ్రమల వద్ద గతేడాది నిల్వలు ఉండటంతో ధర పడిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో, పరిశ్రమలతో మాట్లాడి కిలో మామిడిని రూ.8కి కొనేలా ఒప్పించామని, ప్రభుత్వం తరఫున కిలోకు రూ.4 చొప్పున సాయం అందిస్తున్నామని వివరించారు. ఇప్పటికే అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయని స్పష్టం చేశారు.ప్రభుత్వం రైతులను ఆదుకుంటున్న తర్వాత కూడా జగన్ పర్యటనలు చేయడం వెనుక దురుద్దేశం ఉందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలన్నదే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు.

# హక్కులను హరించివేస్తున్న కేంద్రం.

- కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న 'మోడీ సర్కార్' పై తిరగబడాలి.
- ప్రైవేటీ కరణ ముప్పునుంచి ప్రభుత్వ సంస్థలను రక్షించుకుందాం.
- కార్మికులు, కర్షకులు, ఉద్యోగులపై ముప్పేటదాడికి పాల్పడుతున్న కేంద్రం.
- విపక్షాల జిల్లా నేతలు ఎస్ కె సాబీర్ పాషా, మచ్చ వెంకటేశ్వర్లు.
- కొత్తగూడెంలో భారీ ర్యాలీ.. విజయవంతమైన సార్వత్రిక సమ్మె.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్) జూలై 09,** కొత్తగూడెం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షణ, ప్రజా హక్కులను కాలరాస్తూ పాలనా సాగిస్తోందని, కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు, చట్టాలు అన్నివర్గాలకు గుది బండగా మారుతున్నాయని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, న్యూ డిమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు అన్నారు. కేంద్రప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలు, కార్మికచట్టాల సవరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర కార్మిక, ఉద్యోగ సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్ల ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటీ రంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులు బుధవారం స్వచ్ఛందంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నారు. సమ్మె సందర్భంగా పట్టణంలోని ఓల్డ్ డిపో సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్తూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. ఐదు దశాబ్దాల క్రితం పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం యాజమాన్యాల కు, కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడులుగా మార్చివేసిందని, కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో కార్మికులు పనిగంటలు పరిమితి హక్కు, సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు, కనీసవేతనాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఎనిమిది గంటల పనివిధానాన్ని రద్దు చేసి శ్రమ దోపిడీకి కేంద్రం తెరలేపిందని విమర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించి, రూ.600కూలి చెల్లించాలని విపక్షాలు డిమాండ్ చేస్తుంటే కేంద్రం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. రైతాంగా వ్యతిరేఖ చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ కేంద్రంగా జరిగిన సుదీర్ఘ ఉద్యమం సందర్భంగా స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కేంద్రం ఆ హామీలను అమలుచేయకుండా దేశ రైతాంగాన్ని మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ కార్మికులు, ఉద్యోగులకు ఉపాధి లేకుండా చేస్తోందని, ప్రజలకు చెందాల్సిన సహజ వనరులను పెట్టువాడిదారీ వర్గాలకు కట్టబెడుతోందని విమర్శించారు. కేంద్రం తీసుకువచ్చిన జీవో 21తో లక్షలాది మంది మోటారు కార్మికులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయని, ధరల భారంతో పేద, మధ్యతరగతి వర్గాలు సతమతమవుతుంటే కేంద్రానికి చీమకుట్టినట్లైనా లేదన్నారు. కేంద్రం తీరుకు నిరసనగా జరిగిన సమ్మె విజయవంతమైందని, ఈ సమ్మె కేంద్రానికి గుణపాఠం కానుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు నరాటి ప్రసాద్, చంద్ర నరేంద్రకుమార్, కంచర్ల జమలయ్య, వంగ వెంకట్, వాసిరెడ్డి మురళి, భూక్యా శ్రీనివాస్, రమణమూర్తి, సిపిఎం, సిఐటియు నాయకులు ఏజే రమేష్, మధు, భూక్యా రమేష్, లిక్కి బాలరాజు, న్యూ డిమోక్రసీ, మాస్ లైన్, ఇఫ్టూ, టియుసిఐ నాయకులు సంజీవ్, మల్లికార్జున్, సారంగపాణి, సురేందర్, యాకుబ్ శావలి, కెచ్చెల రంగయ్య, కందగట్ల సురేందర్, ఏఐటీయూసీ నాయకులు గౌనె మని, విజయలక్ష్మి, అమర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతంలో జి ఓ 3 అమలుపరిచి గిరిజన నిరుద్యోగులకు న్యాయం చేయాలి

- బానోత్ ఈరు నాయక్ టి యస్ టి టి యఫ్ రాష్ట్ర అధ్యక్షులు.



**సి కె న్యూస్ ప్రతినిధి:** ఇల్లెందు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజు మరియు శ్రీనివాస్ సమక్షంలో తెలంగాణ స్టేట్ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ...ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు మరియు గిరిజన నిరుద్యోగులకు స్థానికత ఆధారంగా ఉద్యోగ నియమకాలు జి ఓ 3 ద్వారా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నమని తెలంగాణ స్టేట్ ట్రైబల్ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ ఈరు నాయక్ అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు పి ఆర్ సి ని అమలు చేయాలని, రాష్ట్రంలో నూతన పెన్షన్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఉద్యోగులకు ఐదు పెండింగ్ డి ఏ లను ప్రకటించాలని, ఉపాధ్యాయులకు బదిలీతో కూడిన పదోన్నతులు కల్పించాలని, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు మరియు భాషా పండితుల పోస్టు అప్గ్రేడ్ చేసి వారికి పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి యస్ టి టి యఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లాకావత్ రాందాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి సపావత్ బాలకృష్ణ, రమేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేసే ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి.


- బ్రదర్ రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన బెస్ట్ అవైలబిలిటీ స్కీం తల్లిదండ్రులు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చుంచుపల్లి ప్రతినిధి, (సాయి కౌశిక్)జూలై 09,** గత తొమ్మిది సంవత్సరాల నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం ద్వారా నిరుపేద ఎస్సీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఉచిత విద్యను అందించడం జరుగుతుందని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి యువజన సంఘం, బిఏఎస్ పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోట శివ శంకర్ అన్నారు బుధవారంబెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రమ శిక్షణతో పాటు మంచి విద్యను అందిస్తున్న సెయింట్ జోసెఫ్ ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం ధన్బాద్ లో గల సెయింట్ జోసెఫ్ హైస్కూల్లో జరుగుతుందని. ప్రభుత్వం నుంచి గత మూడు సంవత్సరాలుగా స్కూల్ యాజమాన్యానికి యాజమాన్యానికి 70 లక్షలు రావలసి ఉండగా, రాకపోయినా మిగతా పిల్లలతో సమానంగా ఎక్కడ తక్కువ చేయకుండా నిరుపేద ఎస్సీ విద్యార్థులను ఎక్కడా లోటు లేకుండా పుస్తకాలతో పాటు బట్టలు ఇచ్చి గత తొమ్మిది సంవత్సరాల నుంచి మంచి విద్యతో విద్యార్థులను తీర్చిదిద్ది గత నాలుగు సంవత్సరాల టెన్త్ క్లాస్ లో బిఏ స్కీం విద్యార్థులందరూ 515 మార్కుల పైబడి ఐదుగురు విద్యార్థులకు 440 ఐదుగురు విద్యార్థుల కు మంచి మార్కులు వచ్చేలా నిరుపేద ఎస్సీ విద్యార్థులను తీర్చిదిద్దిన సెయింట్ జోసెఫ్ స్కూల్ యాజమాన్యం సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్ రెడ్డి బ్రదర్ కి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయుల కు అందరూ పేద నిరుపేద విద్యార్థులు పేద ప్రజల పట్ల తమ ఔన్నత్యాన్ని చాటుకోవడం జరిగిందని ఇదే పద్ధతి కొనసాగిస్తు మంచి నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణతో సామాజిక విలువల తో కూడిన విద్య వల్ల సమాజం లో బాధ్యత గల పౌరులుగా తయారవ్వడానికి సెయింట్ జోసఫ్ హై స్కూల్ స్కూల్ ప్రిన్సిపాల్ గా బ్రదర్ రాజశేఖర్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని ఇదే పట్టుదలతో మరో ఐదు సంవత్సరాలు ప్రిన్సిపాల్ గా కొనసాగాలని సెయింట్ జోసెఫ్ స్కూల్లో విద్యార్థుల ను ఎంతో పట్టుదలతో క్రమశిక్షణతో విద్యార్థులను మంచి విద్యను అందిస్తున్నారని రాజశేఖర్ రెడ్డి బ్రదర్ వచ్చిన తర్వాత వరుసగా మూడు సంవత్సరాలు టెన్త్ క్లాస్ విద్యార్థులకు ఎంతో క్రమశిక్షణతో పాటు మంచి విద్యను అందిస్తూ టెన్త్ క్లాస్ లో అత్యధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం బి ఏ ఎస్ పేరెంట్స్, విద్యార్థులు అత్యధికంగా టెన్త్ క్లాస్ బి ఏ ఎస్ విద్యార్థులు పదిమందికి 10 మందిలో ఐదుగురు 530 పైబడి మార్కులు మిగతా ఐదుగురు విద్యార్థులు 440 మార్కులు పైబడి సాధించినందు కు కృషి చేసిన యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు కందుల గురుమూర్తి,కత్తి భాస్కర్, తిట్ల శంకర్,తీట్ల లీలా, సరోజ సంతోష్, లక్ష్మీ , నమిల్ల రాము,దుర్గాభవాని, భాగ్య , తదితరులు ఉన్నారు.

## మధ్యవర్తిత్వమే వివాదాల పరిష్కారానికి మార్గం

- త్వరిత పరిష్కారానికి ఉపయుక్తం - జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా



**శ్రీకాకుళం, జూలై 9 సీ కే న్యూస్ :** న్యాయ వ్యవహారాల్లో మధ్యవర్తిత్వం ద్వారా త్వరితంగా పరిష్కారం సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. స్థానిక జిల్లా కోర్టు సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన మధ్యవర్తిత్వ న్యాయవాదుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ... న్యాయవాదులు మధ్యవర్తిత్వ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించేందుకు ఇది మేలైన మార్గమని చెప్పారు. మధ్యవర్తిత్వం ద్వారా ఇరు పక్షాలకు సమన్యాయం జరుగుతుందని అన్నారు. శిక్షణలో సీనియర్ న్యాయవాది వి.పీ. తనకచన్, న్యాయవాది పి.జి. సురేష్లు మధ్యవర్తిత్వ విధానం, దాని ప్రయోజనాలు, జాగ్రత్తలు వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. హరిబాబు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు ఇష్టమైన కళ నైపుణ్యాలు సాధించాలి.

- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 09,** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు చదువుతో పాటు వారికి ఇష్టమైన కళల పట్ల మక్కువ కలిగించి వారిలో దాగివున్న ప్రతిభా పాట వాలను, నైపుణ్యాల ను వెలికి తీసే విధంగా సంబంధిత ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.

బుధవారం అశ్వాపురం మండలంలోని గొందిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిసరాలు తరగతి గదులు, వంటశాల, స్టోర్ రూమ్ లోని సామాగ్రి మరియు విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను ఆయన పరిశీలించారు. ముందుగా మూడో తరగతి నుండి 5వ తరగతి వరకు చదువుతున్న పిల్లలకు ఇంగ్లీష్ పదాలను బోర్డుపై వ్రాయించి వాటి అర్థాలను తెలుగులో చెప్పించుకున్నారు. అనంతరం 06వ తరగతి నుండి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్న క్లాసులను ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధనా తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు వారికి అర్థమయ్యే రీతిలో ఇంగ్లీష్ పదాలను వారి చేత బోర్డుపై రాయించి వాటి అర్థాలను తెలుగులో పూర్తిగా చెప్పేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఈ సంవత్సరం ప్రతిరోజు బోధించే పాఠ్యాంశాల తో పాటు అదనంగా విద్యార్థులకు ఇష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయాని కి సంబంధించిన కళల పట్ల అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వాటికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించి అన్ని పాఠశాలలకు పంపిస్తామని ఉపాధ్యాయులు తప్పని సరిగా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో తరగతి గదిలో కూర్చొని విద్యార్థులకు పలు సూచనలు ఇస్తూ చదువుతో పాటు మీకు ఇష్టమైన కళలలో నైపుణ్యాలు సాధించాలని, త్వరలో అన్ని పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు వారికి ఇష్టమైన కళల పోటీతో పాటు క్విజ్ మరియు వ్యాసరచన వివిధ వేషధారణ పోటీలు నిర్వహించేలా ప్రణాళికల రూపొందిస్తామని అన్నారు. వర్షాకాలం నడుస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, విషపూరితమైన క్రిమి కీటకాలు సంచరిస్తూ ఉంటాయని కనుక రాత్రిపూట విద్యార్థులు ఎవరు బయటకు రాకుండా చూడాలని, ప్రతిరోజు వంటగది శుభ్రం చేసి మెనూ ప్రకారము విద్యార్థులకు వేడిగా ఉన్న ఆహారాన్ని వడ్డించాలని, ప్రతిరోజు తాజా కూరగాయలతో వంట చేయాలని, స్టోర్ రూమ్ లో ఉన్న వస్తువులు పాడు కాకుండా చూడాలని, ఎక్స్పైరీ డేట్ అయిన వంట సామానులు ఉంటే వెంటనే వాటిని తీసివేయాలని అన్నారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలవకుండా సైడ్ డ్రైన్లు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

అనంతరం విద్యార్థులతో కూర్చొని భోజనం చేస్తూ ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహారము అందిస్తున్నది లేనిది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చందు, వార్డెన్ వెంకటేశ్వర్లు, సబ్జెక్ట్ టీచర్లు నాగులు, రాము, శోభన్ బాబు, కొండబాబు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విద్యాభ్యాస పాఠశాలలో జ్ఞానేశ్వర్ రాజ్ జన్మదిన వేడుకలు.



### యాభై కిలోల బియ్యం విద్యార్థి విద్యార్థులకు సహపంక్తి భోజనాలు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 09,** సత్తుపల్లి కి చెందిన ఎం మమత,శివకుమార్ దంపతుల కుమారుడు జ్ఞానేశ్వర్ రాజ్ జన్మదిన వేడుకలు. మణుగూరు మండలం సంతోష్ నగర్ లోని శ్రీ విద్యాభ్యాస పూర్వ బాలు వెలుగు పాఠశాల లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు యాభై కిలోల బియ్యాన్ని విద్యార్థినీ విద్యార్థులకు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ వై విజయలక్ష్మి పండిట్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరుపేద విద్యార్థిని విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడుతున్న శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులను మరియు సిబ్బందిని ఆమె అభినందించారు. మణుగూరు ప్రాంతంలో శ్రీ విద్యాభ్యాస పాఠశాల మరియు వృద్ధాశ్రమాలకు సమీప గ్రామాల నిరుపేద ప్రజలకు ఎంతగానో సహాయపడుతూ ఇచ్చుకునే వారికి పుచ్చుకునే వారికి మధ్య వారధిగా సహాయ సహకారాలు అందిస్తున్న మణుగూరు ఏరియా సింగరేణి సేవా సమితి సామాజిక సేవా స్ఫూర్తిని ఆమె కొనియాడారు. తమ కుమారుని జన్మదిన వేడుకలు సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించిన సత్తుపల్లి కి చెందిన మమత శివకుమార్ దంపతులను సమన్వయం చేస్తున్న సత్తుపల్లి చెందిన సింగరేణి ఉద్యోగిని రజినీ ని ఆమె ఎంతగానో ప్రశంసించారు. దాతల సహకారంతో విద్యార్థి విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమే ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యులు యస్ డి నా సర్ పాషా, సామాజిక సేవకురాలు నాగుల జ్యోతి, పాఠశాల నిర్వహకులు బి జగన్మోహన్ రెడ్డి, కిరణ్, సిబ్బంది రాధా తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం దరఖాస్తులకు గడువు ఈ నెల 12 వరకు పొడిగింపు.

- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ప్రకటన.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), జులై 09,** రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ పథకం ద్వారా తెలంగాణ రాష్ట్రం నుండి సివిల్స్ ప్రిలిమ్స్ లో పాసై మెయిన్స్ కు హాజరవుతున్న అభ్యర్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు వెల్లడించారు.

దరఖాస్తుల స్వీకరణ కు గతంలో ఇచ్చిన గడువు తేదీ ఈనెల 7వ తేదీతో ముగిసిపోయింది. అయితే అభ్యర్థుల నుంచి వస్తున్న విజ్ఞప్తుల మేరకు ఈ నెల 12వ తేదీ వరకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సివిల్స్ ప్రిలిమ్స్ లో పాసైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని 12వ తేదీలోగా దరఖాస్తులు ఆన్లైన్ లో సమర్పించాలని కోరారు. అలాగే సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన సింగరేణి ఉద్యోగుల పిల్లలకూ రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు.

ఇదీ నేపథ్యం...

గతేడాది రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకాన్ని ప్రారంభించారు. గతేడాది 140 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరికి ఒక్కొక్కరికి సింగరేణి సంస్థ లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహక నగదును అందజేసింది. వీరిలో 20 మంది మెయిన్స్ లోనూ పాసై ఇంటర్వ్యూకి ఎంపిక కాగా వారికి కూడా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ప్రోత్సాహకాన్ని అందించింది. ఇదే విధంగా ఈ ఏడాది కూడా తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది.

## రేగా నరసమ్మ కి నివాళులార్పించి ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 09,** బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు తల్లి రేగా నరసమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులార్పించి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల మాజీ వైస్ ఎంపీపీ కే వి రావు, సమితి సింగారం ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ కమటం నరేష్, అశ్వాపురం మండల నాయకులు వలబోజు మురళీ కృష్ణ, పర్వత నరేష్, త్రిపురారి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు

# మాలల ఐక్యత "యూనిటీ ఆఫ్ మాల" తోనే సాధ్యం

- సంఘం 5వ ఆవిర్భావ సభ లో బి.జీ క్లైమెంట్ వెల్లడి
- జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖులకు సత్కారాలు



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం:తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటు వంటి మాలజాతి సంతతని ఐక్యం చేయుటకై ఖమ్మం పట్టణ నడిబొడ్డున ఆవిర్భవించిందే యూనిటీ ఆఫ్ మాల జిల్లా సమితి అని స్టీరింగ్ కమిటీ పెద్దలు , నగర కార్పొరేటర్ బి.జీ క్లేమెంట్ స్పష్టం చేశారు . నిత్యం జాతిని జాగృతం చేస్తూ జాతిలో ఆర్థికంగా వెనక బడిన వారికి సేవ చేయటమే తమ యొక్క లక్ష్యం అని వ్యాఖ్యానించారు . ఆ సంఘం యొక్క 5వ ఆవిర్భావ సభ పట్టణంలోని అంబేద్కర్ భవనం లో జిల్లా అధ్యక్షుడు కందుల ఉపేందర్ అధ్యక్షతన జరిగింది . ఈ సమావేశం లో సంఘం యొక్క పని తీరును చర్చించటంతో పాటుగా భవిష్యత్తు కార్య చరణను జిల్లా కమిటీ రూపొందించింది . ఈ సందర్భంగా మాల జాతిలో పుట్టి ఉన్నత శిఖరాలు అదిరోహించిన పలువురి ప్రముఖులను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సత్కరించారు . నూతనంగా ఎన్నికైన టీఎస్జీవో రాష్ట్ర కార్యదర్శి జమ్మి జయ పాల్ , లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఐఎంఏ సెక్రటరీ , సుమన్ టీవీ వారిచే బెస్ట్ డాక్టర్ అవార్డు అందుకున్న ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్ , మరో బెస్ట్ డాక్టర్ అవార్డు గ్రహీత చిన్న పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు టీ. పవన్ కుమార్ లను జిల్లా కమిటీ ఘనంగా సన్మానించింది . భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సన్మాన గ్రహీతలను సంఘ సభ్యులు అభినందించారు . ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి అవుట మధు , స్టీరింగ్ కమిటీ పెద్దలు గుల గట్టు యల్లయ్య , చిలక బత్తిని కనకయ్య , తెలగమల్ల గోవింద్ , వర్కింగ్ ప్రెసిడెంట్ జాగటి మధు , ప్రముఖ అడ్వకేట్ పంబ నాగేశ్వరరావు , జంగం లక్ష్మి నారాయణ , కమటం లక్ష్మణ్ , అప్పం సురేష్ , కాశీ మల్ల శాంతయ్య , చింతల రవి , గుజ్జా రామకృష్ణ , కందుల రమణ , జానకి రాములు , ధారా సందీప్ , మోహన్ , సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని భారీ ర్యాలీ

- ఐ ఎఫ్ టి యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో




సికె న్యూస్ ప్రతినిధి,ఖమ్మం : దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టినటువంటి నిరసన కార్యక్రమానికి ముందుగా భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం పట్టణం లెనిన్ నగర్ లోని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం నుండి భారీ ప్రదర్శనగా ఎన్ ఎస్ టి రోడ్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు నుండి కమల మెడికల్ మయూరి సెంటర్ మీదుగా పెవిలియన్ గ్రౌండ్ కి చేరుకోవడం జరిగింది . ఐ యఫ్ టి యు జిల్లా అధ్యక్షులు షేక్ సుబహాన అధ్యక్షతన నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు పాల్గొని మాట్లాడారు . బుధవారం జరుగుతున్నటువంటి దేశవ్యాప్త సమ్మెను ఉద్దేశించి దేశంలో 50 కోట్ల మంది కార్మికులకు పైగా ఈ సమ్మెలో పాల్గొంటున్నారని , 26 కోట్ల మంది రైతాంగం ఈ సమ్మెకు మద్దతు తెలిపిందని అన్నారు . ఇకనైనా కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నటువంటి కార్మిక వ్యతిరేక , రైతు వ్యతిరేక,నల్ల చట్టాలను రద్దు చేయాలని , ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని , ఔట్సోర్సింగ్ , కాంట్రాక్ట్ బేసిక్ , అంగన్వాడి , ఆశా వర్కర్ల , గ్రామపంచాయతీ వర్కర్స్ లాంటి వారికి కేంద్ర ప్రభుత్వం , ఉద్యోగ భద్రత కల్పించాలని , సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని , సుప్రీంకోర్టు తీర్పున అమలు చేయాలని అన్నారు . ఈ దేశంలో ఉన్నటువంటి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోడీ , దేశంలో ఉన్నటువంటి కార్మికుల మీద సవితి తల్లి ప్రేమని కూడా చూపించడం లేదని వారు నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని విమర్శించారు . కార్మికుల మీద రొమ్ములు విరిచిన ప్రభుత్వలు కాలగర్భంలో కలిసిపోయాయని , ఇదేవిధంగా ఒంటెద్దు పగడాలు పోతే నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుందని వారు విమర్శించారు . ఈ కార్యక్రమంలో ఐ యఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వెంకన్న , ఐ యఫ్ టి యు జిల్లా నాయకులు గౌని మోహన్ రావు , గుగులోత్ పటేల్ , బోడ నాగేశ్వరరావు , కే మాధవరావు , శిరోమణి , ప్రశాంతి , రేణుక , జాన్ రెడ్డి , సైదారావు , దేవదాస్ , సైదులు , న్యూడెమోక్రసీ నాయకులు పాముల మోహన్రావు , పరకాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## జూలై 11న జాబ్ మేళా నిర్వహణ .... జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

- రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెని ఉద్యోగాలకై జాబ్ మేళా నిర్వహణ

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూలై, 09:జిల్లాలోని డిగ్రీ అర్హత గల నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో రిలేషన్షిప్ మేనేజర్ ఉద్యోగాలు కల్పించుటకు జూలై 11న శుక్రవారం ఉదయం 10.00 గంటలకు మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంపికైన వారికి వేతనం 20 వేల నుండి 50 వేల వరకు ఉంటుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఖాళీగా ఉన్న మొత్తం 25 ఉద్యోగాల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు



- తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న వాగ్దానం 12 వేల రూపాయలు ఇవ్వాలి.
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి.

సికె న్యూస్ ప్రతినిధి ,ఖమ్మం : జాతీయ కార్మిక సంఘాలు , స్వతంత్ర ఫెడరేషన్ లు , రాష్ట్ర వ్యాపిత కార్మిక సంఘాలు జూలై 09 జాతీయ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని అందరికి తెలిసిన విషయమే . ఈ సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు . 10 సంవత్సరాలు జైలు శిక్ష , ఏడు లక్షల జరిమానా ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు కఠినంగా శిక్ష విధించే భారత న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2) ని రద్దు చేయాలి . అలాగే టూవీలర్ ద్వారా నడుస్తున్న రాపిడో ఓలా ఉబర్ లాంటి సంస్థలను రద్దు చేసి ఆటో డ్రైవర్లకు న్యాయం చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి పార్లమెంట్ అధ్యక్షులు పాల్వంచ కృష్ణ , సీఐటీయూ (ఏ ఐ ఆర్ టి డబ్ల్యూ ఎఫ్ ) ప్రధాన కార్యదర్శి జిల్లా ఉపేందర్ , రాందాస్ , ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ బాయ్ , పేరబోయిన మోహన్ రావు , రావుల శ్రీను , బి ఆర్ టి యు జిల్లా నాయకులు ఎస్ కే సత్తార్ , టి యు సి ఐ జిల్లా అధ్యక్షులు శ్రీను , నాయకులు లక్ష్మీనారాయణ , టి యు సి ఐ జిల్లా నాయకులు ఘరు రవీందర్ పాల్గొన్నారు .

## అత్యంత భక్తిశ్రద్ధలతో రాష్ట్రవ్యాప్తంగా సీతలా భవాని పండుగ వేడుకలు



సికె న్యూస్ ప్రతినిధి:గిరిజనులైన లంబాడీలు ( గోర్ బంజారాలు ) అత్యంత భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా ఎంతో పవిత్రతతో జరుపుకునే సీతల పండుగను రాష్ట్ర ప్రభుత్వము సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ గోర్ బంజారా ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరపున అభ్యర్థించారు . ఈ పండుగ ప్రపంచం మొత్తం లో నివసిస్తున్న గోరు బంజారాల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ . ఈ పండుగ బంజారాల ఔన్నత్యాన్ని చాటుకుంటారు . కావున రాష్ట్ర ప్రభుత్వము ఈ పండుగ రోజున సాధారణ సెలవు ప్రకటించాలని బంజారా జాతి మనోభీష్టని పరిగణలోకి తీసుకోవాలని కోరారు . ఈ సీతల పండగ ఉత్సవాలలో తెలంగాణ గోర్ బంజారా ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా పాల్గొని విజయవంతము చేయడంలో ముందున్నారు . రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పాల్గొన్న సంఘ నాయకులు ములకలపల్లి లో భూక్య సోమనాయక్ రాష్ట్ర అధ్యక్షులు , ప్రధాన కార్యదర్శి భూక్య లచ్చు నాయక్ , డిఎస్ వినోద్ నాయక్ , డి దేవా నాయక్ , దేవేందర్ నాయక్ , తిరుమలాయపాలెం లో దారావత్ రాములు నాయక్ , కోశాధికారి బాలాజీ నాయక్ , చిన్న తండాలో ఎన్ శంకర్ నాయక్ , బి వెంకన్న నాయక్ , బి. కేశ్యా నాయక్ , అజయ్ తండా నేలకొండపల్లిలో బానోత్ వీరయ్య నాయక్ , రఘునాధపాలెం లో డి ఎస్ నాగేశ్వరరావు నాయక్ , బి. రాందాస్ నాయక్ , బి.రాంబాబు నాయక్ , పాండురంగాపురంలో ఎం. బాల్ సింగ్ , బి.మంగ్యా నాయక్ , పెద్ద తండాలో బి.కిషన్ నాయక్ , హనుమంతు నాయక్ , మూడు మల్ల నాయక్ , బి శ్రీనివాస్ నాయక్ , అక్కినాపురం తండలో బి. రవి నాయక్ , జె గోపీనాయక్ , ఏన్కూరులో ఎన్.శ్రీనివాస్ నాయక్ , డి.బిక్ష నాయక్ , శ్రీ రామ్ నగర్ తండలో బి శోభనాయక్ , బంగ్లా చంద్రు తండాలో బోడ వీరన్న నాయక్ , గొరిల్లా పాడు తండాలో భానోత్ నెహ్రూ నాయక్ , చందా నాయక్ , భద్రు నాయక్ , వీరన్న నాయక్ , మరిపెడ బంగ్లాలో జి నామానాయక్ , భీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు .

## భద్రాచలం ఈవోపై దాడిని ఖండించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 09,

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయానికి చెందిన భూములను రక్షించేందుకు వెళ్లిన ఈవో రమాదేవిపై పురుషోత్తపట్టణం గ్రామ పరిధిలో జరిగిన దాడిని బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది.

భద్రాచలం దేవస్థానానికి సర్వే నెంబర్లు 1 నుండి 101 వరకు ఉన్న 889 ఎకరాల భూములు ఆంధ్రప్రదేశ్ లోని పురుషోత్తపట్టణం గ్రామ పరిధిలో ఉన్నాయి. ఈ భూములపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గత సంవత్సరం ఇచ్చిన తీర్పు ప్రకారం, అవి ఆలయానికి చెందునని తేలింది.

ఈ తీర్పు ఆధారంగా అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు దేవస్థానం సిబ్బందితో కలిసి ఈవో రమాదేవి పరిశీలనకు వెళ్లిన సమయంలో, కొంతమంది దుండగులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆమె స్పృహ తప్పి పడిపోవడం వల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఈ సందర్భంగా రెడ్డి సత్రంలో నిర్వహించిన బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ:

"దేవుడి భూమిని కాపాడే ధైర్యం చేసిన అధికారులపై దాడి జరగడం బాధాకరం. ఇది కేవలం ఓ ఉద్యోగిపై దాడి కాదు, భక్తుల విశ్వాసం పై దాడి. భద్రాచలం ఆలయ గౌరవాన్ని కాపాడటం ప్రతి ఒక్కరిపై నైతిక బాధ్యత. ఈ దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది." అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు: స్టేట్ కౌన్సిల్ మెంబర్: కుంజా ధర్మా, జిల్లా ఉపాధ్యక్షులు: పసుమర్తి సతీష్ జిల్లా కౌన్సిల్ మెంబర్: నిడదవోలు నాగబాబు, మండల అధ్యక్షుడు: ముత్యాలు శ్రీనివాస్, సీనియర్ నాయకులు: ములిశెట్టి రాంమోహన్ రావు, దేవరపల్లి వెంకటేశ్వర్లు, బోడా సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శులు: చెల్లుబోయిన వెంకన్న, ముత్యాలు చంద్ర శేఖర్

కిషాన్ మోర్చా రాష్ట్ర నాయకులు: ఏనుగుల వెంకటరెడ్డి, బూర్గంపహాడ్ మండల అధ్యక్షుడు: సాయి శ్రీనివాస్, ఓబీసీ జిల్లా నాయకులు: శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## రేగా నరసమ్మ కి నివాళులర్పించి ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 09,బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు తల్లి రేగా నరసమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని వారి పార్థివ దేహానికి పూల మాల వేసి నివాళులార్పించి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య.ఈ కార్యక్రమంలో మణుగూరు మండల మాజీ వైస్ ఎంపీపీ కే వి రావు, సమితి సింగారం ఉప సర్పంచ్ పుచ్చకాయల శంకర్, యూత్ కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ కమటం నరేష్, అశ్వాపురం మండల నాయకులు వలబోజు మురళీ కృష్ణ, పర్వత నరేష్, త్రిపురారి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు

## బుగ్గ వాగు బ్రిడ్జి పనులను పరిశీలించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



సి కే న్యూస్ ఇల్లందు నియోజకవర్గ ప్రతినిధి ( వెంకటేష్)జూలై 09,ఇల్లందు పట్టణం నడిబొడ్డున ఉన్న బుగ్గ వాగు బ్రిడ్జి సుందరీకరణ పనులను బుధవారం స్థానిక శాసనసభ్యులు కోరం కనకయ్య ప్రత్యక్షంగా సందర్శించి, పరిశీలించారు.

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆయన సూచనలు చేశారు. వర్షపు నీరు నిలిచి ఉండకుండా, పరిసర ప్రాంతాల నివాసితులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించారు. ఇక సైడ్ ట్రాకింగ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్ఎల్ఏ కాంట్రాక్టర్కు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బుగ్గ వాగు ప్రక్షాళన పనుల్లో నాణ్యతతో పాటు పనుల వేగం కూడా తప్పనిసరిగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మలపాటి వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, జిల్లా శ్రీనివాస్, మండల రాము, నరేంద్రుల అను, అధికారులు, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## సినిమాటోగ్రఫీ రంగంలో స్వల్ప కాలిక నైపుణ్య కోర్సులు ....

- న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ కె. వెంకట రాజు
- ప్రతి కోర్సుకు 35 వేల ఫీజు, కాంబో కోర్సులపై డిస్కౌంట్
- 12 వారాల పాటు నైపుణ్య శిక్షణ, ప్రతి బ్యాచ్ లో 40 సీట్లు



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, జూలై, 09:సినిమాటోగ్రఫీ రంగంలో స్వల్ప కాలిక నైపుణ్య కోర్సులు అందిస్తున్నామని ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ ( నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ) అసిస్టెంట్ డైరెక్టర్ కె. వెంకట రాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రివర్యుల ఆదేశాల మేరకు న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ) ఆధ్వర్యంలో శశి ప్రీతం అకాడమీ ఆఫ్ సినిమా అండ్ ఎంటర్టైన్మెంట్ (స్పేస్) సౌజన్యంతో 12 వారాల పాటు సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్, డబ్బింగ్ అండ్ వాయిస్ ఓవర్ స్కిల్, యాంకరింగ్ అండ్ ఈయంసిఈఈ., డిజిటల్ డిజైన్ అండ్ సోషల్ మీడియా మేనేజ్మెంట్, మ్యూజిక్ ప్రొడక్షన్, ప్రొఫెషనల్ సింగింగ్, ప్రొడక్షన్ మేనేజ్మెంట్, అకౌస్టిక్ డిజైన్ వంటి కోర్సులలో నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.

ప్రతి కోర్సుకు 35 వేల రూపాయల ఫీజు ఉంటుందని, కాంబో ఆఫర్ పై డిస్కౌంట్ లభిస్తుందని, హైదరాబాద్ కొండాపూర్ లోని న్యాక్ అకాడమీలో శిక్షణ ఉంటుందని అన్నారు. ఖమ్మం ఐటిఐలో ఈ కోర్సుల పట్ల అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించామని అన్నారు. ఆసక్తి గల వారు ఈ కోర్సు నేర్చుకోవచ్చని తెలిపారు.

ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్టిఫికెట్ జారీ చేస్తుందని, 35 వేల ఫీజు 3 విడతలలో చెల్లించవచ్చని, వీరికి అవసరమైతే న్యాక్ హాస్టల్ లో సబ్సిడీ తో వసతి కల్పించడం జరుగుతుందని, 14 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మరిన్ని వివరాలకు o919059310315 నెంబర్ కు సంప్రదించగలరు.

## బిఎల్ఓలకు, శిక్షణ నిర్వహించిన, చేగుంట తాసిల్దార్ శ్రీకాంత్





**జూలై 09 (సీ కే న్యూస్) చేగుంట** చేగుంట మండల కేంద్రం లో రైతు వేదికలో, చేగుంట తహసిల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బిఎల్ వోలకు, ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ శ్రీకాంత్ మాట్లాడుతూ బిఎల్ఓలు, తమకు అప్పగించిన పనులను సక్రమంగా నిర్వర్తించాలని, ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు, దేశవ్యాప్తంగా బిఎల్వోలకు, శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ముఖ్యంగా గ్రామాల్లో ఎవరైనా ఊరు విడిచి వెళ్ళిపోతే, వారి పేరును తొలగించాలని సూచించారు. ఎవరైనా మరణించిన వారు ఉంటే వారి పేర్లను సైతం తొలగించాలని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో చేగుంట తాసిల్దార్ శ్రీకాంత్, నార్సింగి తాసిల్దార్ కరీముల్లా , మసాయి పెట్ తాసిల్దార్ వసంత, ఉమశంకర్, మధుసూదన్, శ్రీనివాస్, వెంకటేశ్వర్, ఎలక్షన్స్ సూపర్వైజర్లు, బి ఎల్ వోలు, రెవెన్యూ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికుల కోడ్స లను వెంటనే రద్దు చేయాలి

**సీఐటీయూ జిల్లా నాయకురాలు, బాలమణి**



**జూలై 09 (సీ కే న్యూస్) చేగుంట:**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను, వెంటనే రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం రోజుకు 10 గంటల పని చేయాలని తీసుకువచ్చిన జీవో 282ను వెంటనే ఉపసంహరించుకోవాలని, దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా చేగుంట మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించి ఎంపీవో ప్రశాంత్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

సిఐటియు జిల్లా నాయకురాలు బాలమణి, మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ లను తీసుకువచ్చి , కార్మిక చట్టాలకు, రక్షణ లేకుండా చేసిందని .కార్మికులు పెట్టుబడిదారులకు, దాసోహంగా, ఉండే విధంగా ఈ చట్టాలలో మార్పు చేస్తూ కనీస వేతనాలు అడగకుండా,. కార్మికులకు,పని భద్రత లేకుండా,యజమానులను ప్రశ్నించడం కోసం యూనియన్లు,పెట్టుకునే హక్కు లేకుండా చేసిందని ఆమె విమర్శించారు, రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన 282 జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని, కనీస వేతనం 26,000 ఇవ్వాలని కార్మిక చట్టాలకు రక్షణ కల్పించాలని, ఎనిమిది గంటల పని దినం యధాతథంగా కొనసాగించాలని,ఆమె డిమాండ్ చేశారు,ఈ కార్యక్రమంలో మండల వివిధ సంఘాల నాయకులు.తదితరులు పాల్గొన్నారు

## అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి.



**సి కే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 9.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని లింగరాజు పల్లి గ్రామంలో గంగదారి ఉపేందర్ అకాల మరణం చెందినారు, అంత్యక్రియలల్లో పాల్గొని వారి పార్దివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన భువనగిరి మాజీ శాసనసభ్యులు పైల శేఖర్ రెడ్డి గారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# మెగా ఆధార్ క్యాంపుకు విశేష స్పందన...

- మండలాల వారీగా ఆధార్ క్యాంపులు.
- అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 09,**కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మెగా క్యాంపు కు ప్రజల నుండి విశేష స్పందన లభించింది అని జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించు మెగా ఆధార్ క్యాంపును అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ ప్రారంభించారు. ఆధార్ వివరాల నవీకరణ, చిన్నపిల్లల బయోమెట్రిక్ నమోదు, చిరునామా మార్పులు, మొబైల్ నెంబర్ అనుసంధానం వంటి సేవలు ఒకే చోట అందుబాటు లో ఉండటంతో పెద్ద ఎత్తున ప్రజలు మెగా ఆధార్ క్యాంపుకు విచ్చేసి సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున మెగా ఆధార్ క్యాంపు కు ప్రజలు తరలివచ్చారని, వారికి అనుగుణంగా కావలసిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి బృంద సభ్యులు ఆదార్ సమస్యలపై తగిన పరిష్కారాలు చూపించారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారి సౌకర్యార్థం ప్రతి మండల కేంద్రంలో ఆధార్ క్యాంపును నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు ఆధార్ నవీకరణ మరియు సవరణకు వస్తున్నందువలన ప్రతి మండలంలో షెడ్యూల్ వారిగా ఆధార్ క్యాంపులు.

ప్రజలకు మరింత సౌకర్యంగా ఉండేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 23 మండలాల్లో వేర్వేరు తేదీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

జూలై 10, 11 తేదీలలో : కొత్తగూడెం, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, జులూరు పాడు, చంద్రుగొండ మండలాలకు కలెక్టర్ కార్యాలయం లోని నవభారత్ హాలులో ఆధార్ సేవలు అందించనున్నారు.

జూలై 14, 15, 16 తేదీలలో : భద్రాచలం, బుర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం మండలాలకు భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో, యెల్లందు, టెకులపల్లి, అల్లాపల్లి, గుండాల మండలాలకు యెల్లందు మున్సిపల్ కార్యాలయంలో క్యాంపులు జరుగుతాయి.

జూలై 15, 16, 17 తేదీలలో : దమ్మపేట ఎంపీడీఓ కార్యాలయంలో దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి మరియు ఆస్వారాపేట మండలాలకు, మణుగూరు ఎంపీడీఓ కార్యాలయం లో మణుగూరు, ఆస్వాపురం, పినపాక మరియు కారకగూడెం మండలాలకు క్యాంపులు నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రంలో అవసరానికి తగిన విధంగా ఆధార్ కిట్లు అందుబాటులో ఉంచి వేగవంతంగా సేవలు అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో ప్రజలు ఆధార్ సమస్యలను పరిష్కరించు కునే వరకు నిరంతరంగా ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ యు ఐ డి ఐ అసిస్టెంట్ మేనేజర్ మహమ్మద్ సౌభన్, జిల్లా ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వర రావు మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ, జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి.



- సకాలంలో పట్టణ శాఖల మహాసభలు పూర్తి చేయండి.
- స్థానిక సంస్థలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి.
- కూనంనేని కృషితో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.
- కొత్తగూడెం పట్టణ సీపీఐ ముఖ్య నాయకుల సమావేశంలో జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఎస్ కె సాబీర్ పాషా.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),జూలై 09,**కొత్తగూడెం : ఈ నెల 21న జరగనున్న కొత్తగూడెం పట్టణ మహాసభ అదేవిధంగా 26, 27తేదీల్లో అశ్వారావుపేట లో జరిగే జిల్లా మహాసభలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా కార్యకర్తలకు సూచించారు. బుధవారం సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరి భవన్'లో జరిగిన కొత్తగూడెం పట్టణ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 15 మండలాల మహాసభలు పూర్తి చేశామని, యువజన సమాఖ్య, విద్యార్థి సమాఖ్య జిల్లా మహాసభలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ నెల 21లో కొత్తగూడెం పట్టణంలోని వార్డు, బస్తి శాఖల మహాసభలు పూర్తి చేసి పట్టణ మహాసభకు సిద్ధం కావాలన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికలు ఎప్పుడు ప్రకటించినా పార్టీ శ్రేణులు ఎన్నికల్లో తలబడేందుకు సిద్ధంగా వుండాలని సూచించారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని కృషితో కొత్తగూడెం పట్టణంతోపాటు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తద్వారా పార్టీకి మరింత బలం పెరిగేలా చొరవతీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య, వేంగా వెంకట్, మునిగడప వెంకటేశ్వర్లు, గెడ్డాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, ఎస్ కె ఫహీమ్, వివిధ వార్డులు, పార్టీ శాఖల కార్యదర్శులు, బాధ్యులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాలి...

- మానవాళికి ప్రాణ వాయువునిచ్చి...
- మనుగడనిచ్చే చెట్లను విరివిగా పెంచాలి...
- వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి



**పెబ్బేరు జూలై09 (సి కే న్యూస్)**భవిష్యత్ తరాలు భూమిపై మనుగడ సాగించాలంటే%% ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వనపర్తి పట్టణంలోని ఏకో పార్కులో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ విజయేంద్ర బోయి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి వెంకటేశ్వర్లు,అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, డి.ఎఫ్.ఓ సత్యనారాయణతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏది ఉన్నా లేకున్నా సమస్త మానవాళి జీవనానికి ప్రాణ వాయువు అవసరం ఉంటుందని అలాంటి ప్రాణ వాయువును ఇచ్చే చెట్లను విరివిగా నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.పర్యావరణం సమతుల్యంగా ఉండటానికి 33 శాతం అటవీ ప్రాంతం ఉండాలని, కానీ వనపర్తి జిల్లాలో 18-19 శాతం మాత్రమే ఉందని దీనిని 33 శాతానికి పెంచడానికి జిల్లాలోని ప్రజలందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.జిల్లాలోని ప్రతి విద్యార్థి, యువత తమ ఇళ్లలో,పొలాల్లో ఎక్కడ స్థలం ఉంటే అక్కడ చెట్లు నాటాలని ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని సూచించారు.ప్రజలు తమ ఇళ్ల వాకిలిలో మొత్తం బండలు, కాంక్రీట్ వేసుకోకుండా కొంత స్థలం మొక్కలు నాటేందుకు ఉంచుకోవాలని సూచించారు.ఇళ్లలో పెళ్లి అయిన, పుట్టిన రోజు జరుపుకున్న మరే ఇతర శుభ కార్యక్రమాలు జరుపున్న ఆరోజుకు గుర్తుగా మొక్కలు నాటడం మరచిపోవద్దని తెలియజేశారు.వాతావరణ కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణ సమతుల్యతను పాటించేందుకు వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని,ఈ వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై మొక్కలు నాటాలని ఆయన సూచించారు.వృక్షో రక్షిత - రక్షితః అనే నానుడి ప్రకారం చెట్లను మనం కాపాడితే మనలను చెట్లు కాపాడతాయని అన్నారు.వనపర్తి జిల్లాలో ఈ సంవత్సరం 21 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని,లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ఆయా ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు, విద్యార్థులు అందరూ ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ మొక్కలు నాటాలని తెలియజేశారు.ప్రతి ఇంటి ముందు, పొలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు.ప్రతి పాఠశాల,కళాశాల, ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్ తో పాటు వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల చందర్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,వనపర్తి మండల మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి,మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య,వనపర్తి మున్సిపల్ మాజీ చైర్మన్,వైస్ చైర్మన్లు పట్టణ కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జీ యాదయ్య,జిల్లా అటవీ శాఖ అధికారి సత్యనారాయణ, ఆర్డీఓ సుబ్రమణ్యం,జిల్లా అధికారులు,విద్యార్థులు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మత్స్యగిరి గుట్టపైన మొక్కలు నాటిన ధర్మకర్త ఈతాప రాములు.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు జూలై 9.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని కొండ పైన మత్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి గుట్ట పైన మొక్కలు నాటుతున్న ధర్మకర్త ఈ తాపరాములు ఈ కార్యక్రమంలో ఈవో మోహన్ బాబు గారు చైర్మన్ నరేష్ రెడ్డి గారు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ అసెంబ్లీ నియోజవర్గ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా, సాప రవి



**జూలై 09 (సీ కే న్యూస్) చేగుంట:**మెదక్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నోముల శ్రీకాంత్, ఈరోజు సాపరవి ని నియామక పత్రం అందజేశారు, సందర్భంగా రవి మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి, బీసీల ఐక్యతకు, వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్, కు బీసీ లందరికీ అందుబాటులో ఉండి ఎల్లవేళలా సేవ చేసుకుంటానని తెలిపారు ఈ కార్యక్రమంలో బెండ రమేష్,మహిళా ఉపాధ్యక్షురాలు స్వరూప, అనిల్ కుమార్, మోహన్ చారి బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## జిల్లాలో ఎఐసిసి కార్యదర్శి వంశీచంద్ రెడ్డి పర్యటన

- 12 వరకూ జిల్లాలో మకాం
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్



**సికే న్యూస్ ప్రతినిధి ఖమ్మం:**10 వ తేదీ నుండి 12వ తేదీ వరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి చల్లా వంశీచందర్ రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నట్టు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ నుండి ఖమ్మం జిల్లా ఇన్చార్జిగా నియమితులైన సందర్భంగా జిల్లాకు రానున్నట్లు తెలిపారు. ఆయన పర్యటనలో భాగంగా సంస్థాగత ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రధాన ఎజెండా గా సమావేశాలు ఉంటాయని తెలిపారు. 10 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం, 2 గంటలకు పార్టీ ముఖ్యులతో సమావేశం, 3 గంటల నుండి అందుబాటులో ఉన్న నియోజకవర్గ ఇన్చార్జిలు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరుగుతుంది అని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు ప్రణాళికలను సిద్ధం చేసుకొని వంశీచంద్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే యుద్ధమే. - రాజ్యసభ %వీూ% ఆర్ కృష్ణన్న.



సి కె న్యూస్ వలిగొండ మండలం, ప్రతినిధి బాలరాజు జూలై 9. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ.

ఇటీవల హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30లోగా పూర్తి చేయాలని తీర్పు చెప్పింది. దీని ప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది.స్థానిక సంస్థలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం గా ఉండాలని బీసీ లకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో లో పెట్టింది కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేశారు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ రాష్ట్రంలోని ప్రతి సభలో జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించారు

42 శాతం రిజర్వేషన్ కేటాయించి వెంటనే ఎలక్షన్లు చేపట్టాలి.

రిజర్వేషన్లు పెంచడానికి కులాల వారీగా లెక్కలు తీశారు అసెంబ్లీలో చట్టం చేశారు జీవో తీయకుండా కోర్టు కొట్టి వేస్తుందని ఊహాగానాలతో పెండింగ్లో పెట్టారు స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది 73 74 వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 246%ఱ6ు%6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి అధికారం ఇచ్చింది కావున అసెంబ్లీ చట్టం చేశారు జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు అయితే న్యాయ నిపుణులతో చర్చించి ఏమైనా న్యాయమైన సమస్యలు భావిస్తే సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీలు, కేసులు గెలిచే అవకాశం ఉంది ఎందుకంటే జనాభా లెక్కలు ఉన్నవి అసెంబ్లీ చట్టం చేశారు అలాగే సుప్రీంకోర్టు ఈ డబ్ల్యూ కేసులో 50% సీలింగ్ ఎత్తివేసింది ఇప్పుడు అన్ని కోణాల్లో చూస్తే కేసు గెలిచే అవకాశం ఉంది. చట్ట ప్రకారమైన న్యాయప్రకారము రాజ్యాంగపరమైన అవరోధాలు లేవు కావున సుప్రీంకోర్టులో కేసు గెలుస్తుంది వెంటనే జియో తీసి ఎన్నికలు జరపాలని విజ్ఞప్తి చేస్తున్నాం ఒకవేళ కేసు గెలవకపోతే పార్టీ బాధ్యత లోపాలు ప్రజలు కూడా చూసుకుంటారు బీసీ సంఘాలు చూసుకుంటారు ప్రజా ఉద్యమాల ద్వారా తాడోపేడో తేలుస్తాం కావున తమరు వెంటనే జీవో తీసి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తున్నాం.

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును పరామర్శించిన ఎంపీ వద్దిరాజు



సికే న్యూస్ ప్రతినిధి:మాతృమూర్తిని కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ రేగా కాంతారావును తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలు పరామర్శించారు.కాంతారావు తల్లి లక్ష్మీనర్సమ్మ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు.సమాచారం తెలిసిన వెంటనే ఎంపీ రవిచంద్ర హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరి కాంతారావు స్వగ్రామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం చేరుకుని ఆయన్ను పరామర్శించారు.అలాగే, ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ కు ఫోన్ చేసి కాంతారావుతో మాట్లాడించారు,లక్ష్మీనర్సమ్మ మృతి పట్ల కేసీఆర్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు, సంతాపం వెలిబుచ్చారు.మనోస్థైర్యంతో ఉండాలని కాంతారావును కేసీఆర్ ఓదార్చారు,ఆయనతో పాటు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కేసీఆర్, రవిచంద్రలు ఆకాంక్షించారు.

## కలి మేర టు షా పల్లి వరకు అస్తవ్యస్తంగా రోడ్డు

- కొండ శివ బీజేవైఎం నాయకులు
- భువనగిరి పార్లమెంటు నియోజక వర్గం



సి కె న్యూస్ రిపోర్టర్ షేక్ అజీజ్ :నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గం కట్టంగూరు మండలం పరడ గ్రామానికి వెళ్లాలి అంటే కలిమేర అడ్డరోడ్డు నుంచి షా పెల్లి అడ్డరోడ్డు వరకు రోడ్డు మొత్తం గుంతల మయం అయ్యింది ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ పరడగ్రామం రోడ్డు మారుతలేదు గత 20 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు పోయిన ప్రభుత్వం లో ఉన్న అధికారులు వేస్తామని చెప్పారు కానీ వెయ్యలేరు ఇప్పుడున్న ప్రభుత్వము సంవత్సరంన్నర కావస్తుంది ఇప్పుడున్న ప్రభుత్వం ఇంకా ఏం పట్టించుకోవడం లేదు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు.రోడ్లు మరి అధ్వానంగా అడుగడుగునా గుంతల మయం మారడంతో ప్రజలు ఆ రోడ్డుపై ప్రయాణించడంతో తీవ్రమైన వెన్ను నొప్పులు మరియు ఇతర అనారోగ్య బారిన పడుతున్నారు. ఒక బస్సు లేదు అత్యవసరం పడితే అంబులెన్స్ రావడానికి కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి మా గ్రామానికి నెలకొంది దాదాపు నాలుగు వేల జనాభా కలిగిన గ్రామం అయినా గాని అధికారులు పదేపదే నిర్లక్ష్యం వహిస్తున్నారు..

అదేవిధంగా వాహనాలు కూడా పెద్ద ఎత్తున దెబ్బతింటున్నాయి, గత కొన్ని సంవత్సరములు అధికారులకు మరియు ప్రజా ప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా కూడా స్పందన కరువైంది. రోడ్లు భవనాల శాఖ మంత్రి సొంత జిల్లాలో కూడా ఇంతటి దయనీయమైన పరిస్థితి నెలకొంది. గ్రామ ప్రజలు రోడ్డు బాగా లేక చాలామందికి దెబ్బలు తాకాయి అందుకనే ఇప్పుడున్న ప్రభుత్వం అయినా స్పందించి రోడ్లు వేస్తారని కోరుకుంటున్నాను

# సీకే న్యూస్ కథనానికి స్పందించిన మండల కాంగ్రెస్ నేతలు.



**"బుడగ జంగాలి మూడేళ్ల జిపి రోడ్డు సమస్యకు పరిష్కార మార్గం దొరికింది."**

**"మండల అధికారులను నీడల వెంటాడి సీసీ రోడ్డు మంజూరు చేసిన కార్యకర్తలు."**

"వెంకటాపురం మండలం సి కె న్యూస్ ప్రతినిధి మూల్తానీ"

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో మినీ గ్రామపంచాయతీ పరిధిలోగల రంగరాజపురం కాలనీలో. జిపి రోడ్డు విషయమై గ్రామస్తులు తలెత్తుతున్న సమస్య గూర్చి. గత ప్రభుత్వ కాలం నుంచి గ్రామస్తులు మండల అధికారులకు ఎన్నో మార్లు ఫిర్యాదు రూపంలో దరఖాస్తులు అందించిన. మండల అధికారులు స్పందించకపోవడంతో మండల అధికారుల విధి నిర్వహణ అసమర్థతో విసుగు చెందిన గ్రామస్తులు ఇటీవల సి కె న్యూస్ పాత్రికేయులను సంప్రదించి వారి సమస్య గురించి పాత్రికేయులకు వివరించగా.. గత మూడేళ్లుగా గ్రామస్తులు మినీ గ్రామపంచాయతీ లో గల జిపి రోడ్డు విషయమై సీకే న్యూస్ బృందం గ్రామస్తుల సమస్యను మండల కాంగ్రెస్ కార్యకర్తలకు కళ్ళకు కట్టినట్టుగా ప్రచురింప చేయడంతో స్పందించిన కాంగ్రెస్ నేతలు.. మండల అధికారులను నీడలాగా వెంటాడి. గ్రామస్తుల సమస్యకు పరిష్కార మార్గం చూపించారు.. ప్రజా సమస్యల పట్ల కాంగ్రెస్ మండల శ్రేణులు సకాలంలో స్పందించి సిసి రోడ్డు పనులను ప్రారంభించినందుకు మినీ గ్రామపంచాయతీ సభ్యులైన రంగరాజపురం కాలనీ బుడగ జంగాలి గ్రామస్తులు. మండల అధికారులకు మరియు స్థానిక కాంగ్రెస్ నేతలకు కృతజ్ఞతలు తెలియజేశారు...

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలన్న గారిని విమర్శించే అర్హత ఎవరికి లేదు

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి**

సి కె న్యూస్ ఆత్మకూర్ ఎం రిపోర్టర్ షేక్ అజీజ్ :ఆత్మకూరు ఎం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో బుధ వారం జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య గారి పై విమర్శించిన కొంతమంది బి ఆర్ ఎస్ నాయకుల పట్ల స్పందించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి గారు మాట్లాడుతూ...

సొంత నిధులతో పాటు తన నెల వేతనం తో కలుపుకొని రైతుల కోసం నిలిచిపోయిన కాల్వలు తొవ్వించి, మరమ్మతులు చేయించారు

విద్యార్థుల ఉన్నత చదువుల కోసం జీతం తో పాటు సొంత నిధుల తో ఆర్థిక సహాయం అందజేశారు

నిరుపేద కుటుంబాలలో ఎవరైనా మృతి చెందితే ఆ బాధిత కుటుంబాల కోసం జీతం తో పాటు సొంత నిధుల నుండి తక్షణ ఆర్థిక సహాయం చేస్తున్నారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లిళ్లకు ఆర్థిక సహాయన్నీ జీతం తో పాటు సొంత నిధుల తో అందిస్తున్నారు.

తన పుట్టిన రోజు సందర్భంగా గ్రామాల్లో సేవలు అందిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులకు, అంగన్వాడి ,ఆశ,%ూచీవీ%,లకు దుస్తువులు,చీరలు అందజేశారు.

ప్రమాదవశాత్తు రోడ్డు బారిన పడి గాయాల పాలైన నిరుపేదల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు.

ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్నారు...

ఆపద అని వచ్చిన వారికి లేదనుకుండా ఎంతో మందికి ఆర్థిక సహాయం అందిస్తున్నారు.



ప్రభుత్వం నుండి నిధులు తీసుకొని వచ్చి అభివృద్ధి చేస్తూ, తన సొంత నిధులతో , పాటు తనకు వచ్చే జీతం నుండి ఎంతో మందికి సహాయం చేస్తుంటే ఇవన్నీ మీకు కళ్ళకు కనపడతలేదా

గతంలో అధికారం లేకపోయినా ప్రస్తుతం అధికారంలో ఉన్న తన బీర్ల ఫౌండేషన్ తరపున పలు గ్రామాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన జలప్రదాత

హిందూ ముస్లిం క్రిస్టియన్ తేడా లేకుండా వారి ప్రార్థన మందిరాలకు తనకు తోచిన విరాళాలు ఇచ్చిన గొప్ప నాయకుడు మన ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య గారు పలు గ్రామాలలో తన సొంత డబ్బులతో మట్టి రోడ్లు వేసిన ఘనత ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు శ్రీ బీర్ల ఐలయ్య గారిది

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దాసాని సిద్దులు, నాయకులు దిగోజు నర్సింహా చారి, జన్నాయికోడే నగేష్, బత్తిని ఉప్పలయ్య, ఎగ్గిడి యాదగిరి,తండ శ్రీశైలం, బాషబోయిన పాపయ్య , పోతగాని మల్లేశం, ఎద్దు వెంకటేశ్వర్లు, దొంతరబోయిన భాస్కర్, కోరే మల్లేశం, కొండపల్లి ముత్యాలు, బాషబోయిన లింగం, తండ గోపీనాథ్, మొల్గూరి రాజు, చిత్తర్ల అనిల్, ఎలగందుల మహేష్,తొండల అనిల్, గుండేగాని కిరణ్, యాస సుభాష్, లోడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ఆశావర్కల ధర్నా




సీ కే న్యూస్ ప్రతినిధి,అడ్డగూడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏఐటియుసి ఆశా వర్కర్స్ కార్మికుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెడే చంద్రయ్య సీపీఐ మండల కార్యదర్శి రేఖల శ్రీనివాస్ జిల్లా సమితి సభ్యుడు ఉప్పుల శాంతికుమార్ సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా చెడే చంద్రయ్య మాట్లాడుతూ నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక విధానాల కారణంగా, పేదరికం, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం పెరిగాయన్నారు. మరొక వైపు, కార్పొరేట్ కుటుంబాల ఆస్తులు, సంపద ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయని, ఈ సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుంచి నాలుగు కార్మిక కోడ్లను అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించారన్నారు. కార్మికులు పోరాడి, అనేక త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులన్నిటినీ రద్దు చేయడానికి నరేంద్రమోదీ ప్రభుత్వం కుయుక్తులు పన్నారన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని, సుప్రీంకోర్టు తీర్పులనూ, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలన్నిటినీ భూస్థాపితం చేయడమే పనిగా మోడీ ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్మిక కోడ్ లు అమలులోకి వస్తే ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనాలు, సామాజిక భద్రత, సంఘం పెట్టుకునే హక్కు సంఘాల రిజిస్ట్రేషన్లు–గుర్తింపు, సమిష్టి బేరసారాల హక్కు, సమ్మె హక్కు, ఆందోళనలు చేసే హక్కులు అన్నీ తీవ్రమైన ప్రమాదంలో పడిపోతాయని వారు ఆవేదన వ్యక్తంచేశారు. కార్మిక వర్గ హక్కులపై జరుగుతున్న దాడిని ప్రజలంతా ప్రజాస్వామ్యంపై దాడిగా భావించాలన్నారు. బీఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) చట్టాలను పౌర హక్కులపై దాడికి ప్రయోగిస్తున్నారని. బీఎన్ఎస్ చట్టంలోని సెక్షన్ 111 ప్రకారం, కార్మికులు సంఘటితంగా తమ హక్కులను డిమాండ్ చేస్తే, దాన్ని సంఘటిత నేరంగా పరిగణించి, తీవ్రమైన జైలుశిక్షలు, పెనాల్టీలు విధిస్తున్నారని ధ్వజమెత్తారు.కేంద్ర ప్రభుత్వ ఈ చర్యలన్నీ కార్పొరేట్లు అంబానీ, ఆదానీ ల ప్రయోజనాల కోసమే,చట్టాల సంస్కరణలు తీసుకువస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగు కార్మిక కోడ్ల రద్దుతో పాటు, రూ.26,000 కనీస వేతనం, 8గంటల పనిదినం, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, ఆశా, అంగన్వాడి తదితర స్కీం వర్కర్స్ రెగ్యులరైజేషన్, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సమావేశ నిర్వహణ, మరికొన్ని ముఖ్యంగా ఆశా వర్కర్స్ 18,000 ఫిక్స్ వేతనం కల్పించాలని, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాద బీమా కల్పించాలని హెల్త్ కార్డులు ఇవ్వాలని ఈఎస్ఐ,పిఎఫ్ కల్పించాలని డిమాండ్ల సాధన కోసం ఈ సమ్మె జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు చెడిపల్లి రవీందర్ ఏఐటియుసి నాయకులు సుధాకర్ తరుణ్ ఏఐఎస్ఎఫ్ నాయకులు చిప్పలపల్లి వంశీ ఉప్పుల వంశీ ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు పసల మగ్దలీన ప్రధాన కార్యదర్శి,ఎడ్ల అమృత సభ్యులు సిహెచ్ మంగమ్మ సరిత మహాలక్ష్మి ఆశా కార్యకర్తలు దుర్గమ్మ, మదనమ్మ,మంజుల, నాగమణి,సుమతి, శైలజ,శ్రీదేవి,ఇందిర, పుష్పలత,సునీత, స్వరూప,సురాంబా, సుజాత,స్వప్న,శోభ భాగ్య,నాగలక్ష్మి, మధుర,సువర్ణ,అశ్విని, తో పాటు 30 మంది కార్మికులు పాల్గొన్నారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

## హీటెక్కిన తెలంగాణ రాజకీయాలు..

# స్థానిక ఎన్నికల కోసమేగా?

తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. సవాళ్లు, ప్రతి సవాళ్లతో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతుంది. బీఆర్ఎస్ నేతలు ఎన్నిలకు మూడేళ్ల ముందే రా రమ్మంటూ కాంగ్రెస్ నేతలకు సవాల్ విసురుతున్నారు. ప్రతి చిన్న విషయానికి సై అంటే సై అంటున్నారు. ఎన్నికలకు తెలంగాణలో ఇంకా మూడేళ్లు సమయం ఉంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల సమరం కోసమే ఈరకమైన ప్రయత్నాలు జరుగుతున్నాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ తాము అమలుచేస్తున్న సంక్షేమపథకాలపై చర్చకుసిద్ధమని ప్రకటించారు. అయితే ఇందుకు తాము సోమాజీ గూడ ప్రెస్ క్లబ్ కు వస్తున్నామంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

### ఢిల్లీకి మూటలంటూ...

అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దమ్ముంటే పాలనచేయాలని, సంక్షేమాన్ని అమలు చేయాలని, లేకుంటే అధికారాన్ని కేసీఆర్ కు అప్పగిస్తే పాలనఎలా చేయాలో చూపిస్తామని కేటీఆర్ అన్నారు. తాను చర్చకు సిద్ధమని ప్రెస్ క్లబ్ కు వస్తే తోకముడుచుకు పోయారంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రజలను మోసం చేస్తూ అబద్ధపు పాలన చేసే రేవంత్ రెడ్డికి అధికారంలో కొనసాగేందుకు అర్హత లేదని అన్నారు. ఏ వేదిక అయినా.. ఏ ప్లేస్ అయినా తాను చర్చకు రావడానికి సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. ఢిల్లీకి తిరుగుతూ ముడుపులు అందిస్తూ పదవులను కాపాడుకోవడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ప్రజా సంక్షేమాన్నిపక్కనపెట్టి పదవులను కాపాడుకోవడానికే కాలాన్నివెచ్చిస్తున్నారన్నారు.

### చెల్లి ఎపిసోడ్ తో ఫ్రస్టేషన్ లో...

అయితే కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కేటీఆర్ తన సోదరి కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఫ్రస్టేషన్ లో ఉన్నారని, ముందు తన ఇంట్లో జరుగుతున్న సమస్యలను పరిష్కరించుకుని అప్పుడు చర్చకు సిద్ధం కావాలని కాంగ్రెస్ నేతలు ప్రతి సవాల్ విసిరారు. అయ్య ఫామ్ హౌస్ లో పడుకున్నాడని, ప్రతిపక్షనేతగా అసెంబ్లీకి కూడా రావడం లేదని, దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. తాము ఏ పాయింట్ పైనైనా చర్చకు సిద్ధమని ప్రకటించారు. మొత్తం మీదస్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఈరకమైన సవాళ్లు, ప్రతి సవాళ్లు తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఎక్కువయ్యాయన్నది వాస్తవం.

# కండలు సరే..కిడ్నీలు భద్రం



శరీర సౌష్ఠవాన్ని, సామర్థ్యాన్ని మెరుగు పరచుకోవాలని ఎవరికి ఉండదు? మంచి బలంతో అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తే కలిగే ఆత్మ విశ్వాసమే వేరు. అందుకే చాలామంది ఇప్పుడు జిమ్‌ల మీద ఆసక్తి చూపుతున్నారు. కసరత్తులతో కండలు పెంచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. కాకపోతే కొందరు.. ముఖ్యంగా యువత కృత్రిమంగా, అసహజ పద్ధతులతో అతి వేగంగా కండలు పొంగించుకోవాలని తాపత్రయ పడటమే చిక్కులు తెచ్చిపెడుతోంది. ప్రొటీన్ పొడులు, ప్రొటీన్ మిల్క్‌షేక్‌లు, క్రియాటిన్, అనబాలిక్ స్టెరాయిడ్లు, నొప్పి మందుల వాడకం పెద్ద నష్టమే కలిగిస్తోంది. రక్తాన్ని శుద్ధి చేసి, శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచే కిడ్నీల మీద ఇవి అదనపు భారాన్ని పడేస్తున్నాయి. చివరికి కిడ్నీలు దెబ్బతినే పరిస్థితికీ దారితీస్తుండటం ఆందోళనకరం.

అతడి వయసు 25. ఆరేళ్లుగా జిమ్‌కు వెళ్తున్నాడు. కండలు పెద్దగా పెరగటానికి క్రియాటిన్, ప్రొటీన్ పొడి తీసుకోవాలని అక్కడి ట్రెయినర్ సూచించాడు. నిజమే కాబోలని వాడటం మొదలెట్టాడు. ఒకరోజు కళ్లు తిరగటం, అలసటగా అనిపించింది. పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ మళ్లీ ఇబ్బంది పడుతుండటంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. రక్తంలో క్రియాటినిన్ మోతాదు పెరగటంతో రెండుసార్లు డయాలసిస్ చేయాల్సి వచ్చింది. అదృష్టం కొద్దీ కిడ్నీ పాడవలేదు. కానీ కిడ్నీ నుంచి చిన్న ముక్కను తీసి పరీక్షిస్తే- రక్తాన్ని వడపోసే కిడ్నీల్లోని భాగాలు చాలావరకూ దెబ్బతిన్నట్టు, మూసుకుపోయినట్టు తేలింది. ఒకవేళ ఆసుపత్రికి రావటం కొద్దిరోజులు ఆలస్యమైనట్టయితే కిడ్నీ కోలుకోలేనంతగా దెబ్బతినేదే. అతిగా క్రియాటిన్, ప్రొటీన్ వాడకం వల్ల తలెత్తే అనర్థాలకు ఇదొక ఉదాహరణ. త్వరగా కండరాలను పెంచుకోవాలనే ఆశతో ఇలాంటి అనుచిత పద్ధతులను పాటించే ధోరణి యువతలో ఇటీవల పెరిగిపోతోంది. ఎంతోమంది అనబాలిక్ స్టెరాయిడ్లు, నొప్పి మాత్రలనూ వాడుతున్నారు. ఇవన్నీ కిడ్నీలను దెబ్బతీసే ప్రమాదముండటం గమనార్హం. జిమ్‌లో వ్యాయామాలు చేయటం మంచిదే అయినా జాగ్రత్తగా ఉండటమూ ముఖ్యమేనన్న సంగతి మరవరాదు.

### క్రియాటిన్ కీలక అవయవాలకు చేటు

శరీరంలోని చాలా కండరాల్లో క్రియాటిన్ ఉంటుంది. ఇది పనులు, వ్యాయామం చేస్తున్నప్పుడు కండరాలకు నిరంతరం శక్తి అందిస్తుంది. కండరాలు పుంజుకోవటానికి, త్వరగా కోలుకోవటానికీ తోడ్పడుతుంది. అందుకే జిమ్‌లకు వెళ్లేవారు ఎక్కువసేపు వ్యాయామం చేయటానికి, కండర పుష్టి కోసం పొడులు, మాత్రలు, చాక్లెట్ల రూపంలో అదనంగా వాడుతుంటారు. క్రియాటిన్ పదార్థం ఒక స్థాయి వరకూ పెద్దగా హాని చేయదు. కానీ పెద్దమొత్తంలో తీసుకుంటే మాత్రం మెదడు, కిడ్నీల వంటి కీలక అవయవాల మీద విపరీత ప్రభావం చూపుతుంది. క్రియాటిన్ విచ్ఛిన్నమయ్యే క్రమంలో క్రియాటినిన్ అనే వ్యర్థ పదార్థంగా మారుతుంది. ఇది రక్తంలో కలిసి కిడ్నీలకు చేరుకుంటుంది. దీన్ని వడగట్టటానికి కిడ్నీలు ఎక్కువ కష్టపడి పనిచేయాల్సి వస్తుంది. దీంతో కిడ్నీలు అలసిపోయి, దెబ్బతినే ప్రమాదముంది. కిడ్నీలు సరిగా వడగట్టకపోతే రక్తంలో క్రియాటినిన్ మోతాదులు పెరుగుతాయి. సాధారణంగా ఇది 0.7 నుంచి 1.2 ఎంజీ/డీఎల్ వరకూ ఉండొచ్చు. అంతకన్నా మించితే కిడ్నీ దెబ్బతింటోందనే అర్థం. పొడులు, చాక్లెట్ల రూపంలో క్రియాటిన్ తీసుకునే కొందరిలో క్రియాటినిన్ మోతాదులు 25 ఎంజీ/డీఎల్ వరకూ ఉంటుండటం.. వీరికి తాత్కాలికంగా డయాలసిస్ చేయాల్సిన అవసరమూ ఏర్పడుతుండటం గమనార్హం.

### ప్రొటీన్ కిడ్నీల మీద అదనపు భారం

జిమ్‌లకు వెళ్లేవారిలో చాలామంది వే ప్రొటీన్‌ను తీసుకోవటం ఎక్కువైంది. ఇదిప్పుడు అన్నిచోట్లా తేలికగా అందుబాటులో ఉంటోంది. ప్రొటీన్ కండరాలు పుంజుకోవటానికి తోడ్పడే మాట నిజమే అయినా అనవసరంగా, అతిగా వాడటం హానికరంగా పరిణమిస్తుంది. సాధారణంగా రోజుకు ఒక కిలో శరీర బరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. జిమ్‌కు వెళ్లేవారు తెలిసో తెలియకో 1.5 నుంచి 2 గ్రాముల వరకూ తీసుకుంటుంటారు. 5 గ్రాముల వరకూ తీసుకునేవారు లేకపోలేదు. ఇది చాలా ప్రమాదకరం. ప్రొటీన్ విచ్ఛిన్నమైనప్పుడు పుట్టుకొచ్చే యూరిక్ ఆమ్లం వంటి వ్యర్థాలను వడపోయటానికి, బయటకు పంపటానికి కిడ్నీలు ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. అప్పటికే ఊబకాయం గలవారికి, మాంసాహారులకైతే ప్రొటీన్ పొడులు మరింత చేటు చేస్తాయి. కొందరికి తక్కువ బరువుతో పుట్టటం వంటి కారణాలతో చిన్నప్పటి నుంచే కిడ్నీల్లో రక్తాన్ని వడగట్టే భాగాల సంఖ్య తక్కువగా ఉండొచ్చు. దీంతో రక్తం వడపోత ప్రక్రియ కూడా మందగిస్తుంది. కిడ్నీ పనితీరు బాగా తగ్గిపోయేంత వరకూ పైకి ఎలాంటి లక్షణాలూ కనిపించవు. అంతా బాగానే ఉందనుకుంటారు. ఇలాంటివారు తెలిసో తెలియకో అదనంగా ప్రొటీన్ పొడుల వంటివి తీసుకుంటే కిడ్నీల మీద మరింత భారం పెరుగుతుంది. క్రమంగా దెబ్బతినే ప్రమాదముంది. వీరికి మూత్రంలో సుద్ద (అల్బుమిన్) పడుతుంది కూడా. కొన్నిసార్లు ప్రొటీన్ పొడుల్లో భార లోహాలూ ఉండొచ్చు. ఇవీ దీర్ఘకాల కిడ్నీ జబ్బుకు దారితీసే ప్రమాదమూ ఉంది.

### నొప్పి మాత్రలు ఏవైనా నష్టమే

జిమ్‌లకు వెళ్లి కఠినమైన వ్యాయామాలు చేసేవారు తరచూ నొప్పులను తగ్గించే మాత్రలు వేసుకుంటుంటారు. దీంతో మరింత ఎక్కువగా వ్యాయామాలు చేస్తుంటారు. అసలు విషయం ఏంటంటే- నొప్పి మందులేవైనా కకిడ్నీలకు చేటు చేయటం. ట్రెమడాల్ వంటి కొన్ని సురక్షితమైన మందులున్నప్పటికీ ఇవి గుండె సమస్యలకు దారితీయొచ్చు. కొందరికి వీటితో వెంటనే వాంతులవుతుంటాయి కూడా. డైక్లోఫెనాక్, ఐబూప్రొఫెన్ వంటి ఎన్ఎస్ఏఐడీ రకం నొప్పి మందులను చీటికీ మాటికీ వేసుకుంటే కిడ్నీలు దెబ్బతినొచ్చు. ఇవి కిడ్నీలకు రక్త సరఫరా తగ్గేలా చేయటం ద్వారా వడపోత ప్రక్రియను అస్తవ్యస్తం చేస్తాయి. రక్తంలో సోడియం, నీరు పేరుకునేలా చేస్తాయి కూడా. అందుకే నొప్పి మాత్రలు వేసుకోగానే ఉబ్బినట్టుగా కనిపిస్తారు. కొందరు దీన్ని బరువు పెరిగినట్టుగానూ పొరపడుతుంటారు.

### అనబాలిక్ స్టెరాయిడ్లు రక్తనాళాలకు దెబ్బ

స్టెరాయిడ్లు ఒక్క కండరాలు పెరగటానికే కాదు, రకరకాల పనుల్లో పాలు పంచుకుంటాయి. చాలా జబ్బుల చికిత్సల్లో స్టెరాయిడ్లు వాడుతుంటారు. వీటిల్లో ఒకరకం అనబాలిక్ స్టెరాయిడ్లు. ఇవి కండరాలు, బరువు, రక్త పరిమాణం పెంచటం వంటి మంచి పనులూ చేస్తాయి. అలాగని దీర్ఘకాలంగా, అనవసరంగా వాడితే రక్తనాళాల లోపలి పైపొర దెబ్బతింటుంది. దీంతో రక్తపోటు పెరగటం, కిడ్నీలు దెబ్బతినటం వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. కిడ్నీలను లోపలి నుంచి చూస్తే రక్త గుచ్ఛం మాదిరిగా ఉంటాయి. అందువల్ల రక్తనాళాలను ప్రభావితం చేసే, దెబ్బతీసే ఏ జబ్బయినా వడపోత సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. అనబాలిక్ స్టెరాయిడ్లతో గుండె కండరం మెత్తగా, బలహీనంగా అవటం మరో సమస్య. దీంతో గుండె రక్తాన్ని సరిగా పంప్ చేయలేదు. ఫలితంగా కిడ్నీల్లో వడపోత ప్రక్రియ కూడా మందగిస్తుంది. స్టెరాయిడ్లు రక్తంలో సోడియం, నీటి మోతాదు పెరిగేలా చేస్తాయి కూడా. దీంతో ఒళ్లంతా ఉబ్బినట్టు అవుతుంది. దీన్ని కొందరు బలంగానూ భావిస్తుంటారు. బరువు పెరిగామని అనుకుంటుంటారు. ఇది నిజం కాదు. కిడ్నీలు, గుండె పనితీరు మందగించటమే కారణమని తెలుసుకోవాలి.

### ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

వీలైనంతవరకూ ఆహారం ద్వారానే నాణ్యమైన ప్రొటీన్ లభించేలా చూసుకోవాలి. మాంసాహారంతో లభించే ప్రొటీన్‌తోనే కండలు పెరుగుతాయని అనుకోవటం అపోహ. శాకాహార ప్రొటీన్ కూడా కండర పుష్టికి తోడ్పడుతుంది. చిక్కుడు జాతి కూరగాయలు, పప్పులు, పాలు, పెరుగు వంటి వాటితో ప్రొటీన్ బాగా లభిస్తుంది. నిజానికి వే ప్రొటీన్ పొడి పన్నీరు తయారీలో మిగిలిన ద్రవం నుంచే తయారు చేస్తారు.

క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. కండర పుష్టికి ఇదే కీలకం. కానీ ఏవేవో పొడులు, మాత్రలు తీసుకుంటేనే కండలు పెరుగుతాయని అనుకోవద్దు. వీటితో కండ వృద్ధి చెందినా అది తాత్కాలికమేనని తెలుసుకోవాలి.

ప్రొటీన్ పొడులు, అనబాలిక్ స్టెరాయిడ్ల వంటివి తప్పనిసరిగా వాడాల్సిన పరిస్థితుల్లో విధిగా డాక్టర్‌ను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి. తగు పరీక్షలు చేయించుకొని, శారీరకంగా బలంగా ఉన్నట్టు తేలితే వీటిని వాడుకోవచ్చు.

శరీర సామర్థ్యాన్ని గమనించకుండా ఒక స్థాయిని మించి, గంటల తరబడీ వ్యాయామం చేయటం మంచిది కాదు. హఠాత్తుగా గుండెపోటు రావటానికి ఇదీ ఒక కారణమేనని గుర్తించాలి.

బాగా ఎండగా, వేడిగా ఉన్న చోట్ల వ్యాయామాలు చేయొద్దు.

వ్యాయామాలు చేస్తున్నప్పుడు మధ్యమధ్యలో నీళ్లు కూడా తాగాలి. కేవలం ప్రొటీన్ మిల్క్ షేక్స్‌తోనే శక్తి లభిస్తుందని అనుకోవద్దు. నీటితో లభించే శక్తి, ఉత్సాహం మరే పానీయంతోనూ రాదు.

పొటాషియం లోపం గలవారు అరటి, ఖర్జూరం వంటి పండ్లు తినటం మంచిది.

### ఇవీ ప్రమాద హెచ్చరికలు

కళ్లు తిప్పినట్టు, తల తేలిపోతున్నట్టు అనిపించటం.

త్వరగా అలసిపోవటం, నిస్సత్తువ, నీరసం.

మూత్రం అంతగా రాకపోవటం.

పాదాలు, చీలమండలు, ముఖం, చేతులు ఉబ్బటం.

రాత్రిపూట తరచూ మూత్రానికి వెళ్లాల్సి రావటం.

**ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం అశ్రద్ధ చేయరాదు.**

### వీరు వాడొద్దు

మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలు గలవారు.

నెలలు నిండక ముందే పుట్టినవారు, పుట్టుకతో తక్కువ బరువుతో ఉన్నవారు.

పొగ తాగే అలవాటు గలవారు.

ఊబకాయం గలవారు.

ఇలాంటివారు తక్కువ కాలంలో కండలు, బరువు పెరగటానికి క్రియాటిన్, ప్రొటీన్ వాడకపోవటమే మంచిది.



మస్టర్డ్ చీరలో నిర్మలమైన రూఫ్‌టాప్ మూమెంట్‌ను పంచుకున్న మహిరా శర్మ

# డిమాండ్ చేయకపోయినా కీర్తి కెరీర్ ఇంకా అలాగే!



హీరోయిన్ గా సక్సెస్ అయితే పారితోషికం పరంగా వాళ్ల డిమాండ్ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పని లేదు. హీరోయిన్ అడిగినంత నిర్మాత ఇవ్వాల్సిందే. ఇంకా అదనంగా ఖర్చులు భరించాలి. ఒక్క రూపాయి కూడా వదలకుండా ముక్కుపిండి మరీ వసూల్ చేస్తారు. ఈ విషయంలో హీరోయిన్లు అంతా దాదాపు ఒకే తీరున ఉంటారు. హీరోయిన్ల తీరుతో విసిగిన నిర్మాతలెంతో మంది. వచ్చిన ఫిర్యాదులు ఎన్నో ఉన్నాయి.

అలాగని అందరూ డబ్బు కోసమే పనిచేసే హీరోయిన్లు కారు. కొంత మంది కథా బలం ఉన్న చిత్రాల మోజులో పారితోషికం గురించి పెద్దగా పట్టించుకోరు. అలాంటి వాళ్లలో కీర్తి సురేష్ ఒకరని తెలుస్తోంది. %-%మహానటి%-% తర్వాత కీర్తి ఎంత పెద్ద స్టార్ అయిందన్నది చెప్పాల్సిన పనిలేదు. నిజంగా ఆనాటి మహాన టిని అభిమానించినట్లే తెలుగు ప్రేక్షకులు కీర్తిని అభిమానించారు. దీంతో తనకంటూ ప్రత్యేకమైన ప్యాన్ బేస్ ఏర్పడింది.కానీ ఆ క్రేజ్ ను మాత్రం కీర్తి ఏమాత్రం ఎన్ క్యాష్ చేసుకోలేదు అన్నది అంతే వాస్తవం. కీర్తి స్థానంలో మరో నటి ఉంటే? కోట్ల రూపాయలు వెనకేసింది. కానీ కీర్తి మాత్రం ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఎందుకలా? అని ప్రశ్నిస్తే తాను కేవలం కథకు..అందులో పాత్రకు మాత్రమే ప్రాధాన్యతి ఇస్తానంది. తాను ఏ సినిమా చేసిన ఆ రెండు చూసే సైన్ చేస్తానంది. పారితోషికం అన్నది చివర్లో డిస్కస్ చేసే అంశంగా చెప్పింది.దీంతో కీర్తి డబ్బు ఉమెన్ కాదని అర్దమవుతుంది. సాధరణంగా ఏ హీరోయిన్ అయినా ముందు పారితోషికం గురించి మాట్లాడుతారు. ఆ తర్వాతే కథ గురించి డిస్కషన్ మొదలవుతుంది. కీర్తి తరహాలోనే మృణాల్ ఠాకూర్ కూడా డబ్బుకంటే కథకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తుంది. అందుకే వాళ్లకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.

# నాని -కీర్తి సురేష్ హ్యాట్రిక్ ఎప్పుడు?



నేచురల్ స్టార్ నాని-కీర్తి సురేష్ కాంబినేషన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇద్దరిది సక్సెస్ పుల్ కలయిక. ఇద్దరు జంటగా తొలిసారి నటించిన - నేను లోకల్%-% భారీ విజయం సాధించింది. అటుపై - దసరా- తో మళ్లీ చేతులు కలిపారు. ఈ సినిమాతో ఏకంగా వంద కోట్ల క్లబ్లో కి చేరారు. తెలంగాణ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కిన పీరియాడిక్ చిత్రం భారీ మాస్ హిట్ గా నిలిచింది. ఈ సినిమాతో నాని క్రేజ్ మాస్ లో రెట్టింపు అయింది. కీర్తి కెరీర్ కి ఈ సినిమాలు గొప్ప సక్సెస్ ని అందించినవే.ఇతర హీరోలతో కొన్ని సినిమాలు చేసినా? ఆ సినిమా ఫలితాలు ఆశించిన రేంజ్ లో రాలేదు. నానితో మాత్రం కీర్తికి కలిసొచ్చింది. ఈ నేపథ్యంలో ఇద్దరు హ్యాట్రిక్ చిత్రం ఎప్పుడు చేస్తారు? అన్న చర్చ అభిమా నుల్లో మొదలైంది. ఆ కాంబినేషన్ ని మరోసారి తెరపై చూడాలని ప్రేక్షకులు ఆశ పడుతున్నారు. మరి ఆ ఛాన్స్ ఏ దర్శకుడు తీసుకుంటాడో చూడాలి. ప్రస్తుతం లైనప్ లో ఉన్న నాని నటిస్తోన్న ఏ సినిమాల్లోనూ కీర్తి నటించలేదు. నాని నటిస్తోన్న - ది ప్యారడైజ్- లో కృతి శెట్టి ఎంపికైంది.మరో నాయిక పేరు కూడా విని పిస్తుంది. ఈ సినిమా అనంతరం నాని ఏ డైరెక్టర్ తో పనిచేస్తాడు? అన్నది ఇంకా క్లారిటీ లేదు. ఆ డైరెక్టర్ అయినా హిట్ కాంబినేషన్ కి కలుపుతాడేమో చూడాలి. కీర్తి సురేష్ కూడా హీరోయిన్ గా బిజీగానే ఉంది. తెలుగు, హిందీ చిత్రాలు చేస్తోంది. అలాగే తమిళ్ లోనూ కొన్ని సినిమాలు చేస్తోంది. - రివాల్వర్ రీటా- కీర్తి నటిస్తోన్న తమిళ లేడీ ఓరియేంటెడ్ చిత్రం. - రఘుతాత- తర్వాత కోలీవుడ్ లోనే నటిస్తోన్న మరో ఉమెన్ సెంట్రిక్ చిత్రం కావడం విశేషం.నిజానికి అమ్మడికి కోలీవుడ్ కంటే టాలీవుడ్ లో మెరుగైన మార్కెట్ ఉంది. కానీ ఇక్కడ కంటే అక్కడే ఎక్కు వ అవకాశాలు అందుకోవడం విశేషం. ఇటీవలే కీర్తి సురేష్ నటించిన - ఉప్పుకప్పురంబు- రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. కానీ ఈ సినిమా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. ప్రస్తుతం కోలీవుడ్ లోనే - కన్నెవెడి- అనే మరో సినిమా కూడా చేస్తోన్న సంగతి తెలిసిందే.



చంద్రిక రవికి నో స్టాపింగ్